తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

దేవుడుని అడ్డం పెట్టుకొని...
రాజకీయాలు చేస్తున్న చంద్రబాబు

నాయుడుపేట, జనవరి 30 ప్రభాతవార్త: ప్రపంచంలో వున్న 140 కోట్ల హిందువుల మనుభావాలను దెబ్బతీస్తూ, కలియుగ ప్రత్యక్ష దైవం, ఆ దేవ దేవుడు శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని వారి పవిత్ర ప్రసాదం లడ్డును వారి స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు వాడుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు మంచి బుద్ధిని ప్రసాదించాలని భగవంతుడిని కోరుకుంటున్నట్లు సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. నాయుడుపేట మండల పరిధిలోని తిమ్మాజికండ్రిగ గ్రామంలో వెలసి ఉన్న శ్రీ అభయానుగ్రహ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సంజీవయ్య మాట్లాడుతూ శ్రీవారి ప్రసాదం లడ్డు తయారీలో వాడే నెయ్యిలో జంతు కొవ్వు కలవలేదని సిబిఐ సుప్రీం కోర్టుకు సమర్పించిన నివేదికలో స్పష్టంగా తెలియపరిచందన్నారు. జగన్ మోహన్ రెడ్డిపై ప్రజాదరణను చూచి ఓర్వలేక వైసీపీ అప్రతిష్ట పాలు చెయ్యాలని చంద్రబాబు దేవున్ని అడ్డుపెట్టుకుని రాజకీయాలకు తెరతీశారన్నారు. కోట్లాదిమంది భక్తులను తీవ్ర మనోవేదనకు గురయ్యేలా మాట్లాడిన చంద్రబాబు, పవన్ శ్రీవారి భక్తులకు క్షమాపణలు చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి, మండల కన్వీనర్‌లు ఒట్టూరు కిషోర్‌యాదవ్, పాదరిత హరినాథ్‌రెడ్డి, తిమ్మాజి కండ్రిగ సర్పంచ్ నల్లారి ప్రకాశం, నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, కట్టా భవాని శంకర్ రెడ్డి, కటకం జయరామయ్య, పైనా మల్లికార్జునరెడ్డి, పేట చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కల్తీ' పాపానికి... క్షమాపణ చెప్పాలి
-కల్తీ నెయ్యి నిందితులను వదిలిపెట్టబోం -టీటీడీ చైర్మన్ నాయుడు

మాట్లాడుతున్న టిటిడి చైర్మన్, సభ్యులు

తిరుమల,జనవరి 30ప్రభాతవార్తప్రతినిధి: గతంలో అధికారంలో ఉన్న ఐదేళ్ల వైసిపి ప్రభుత్వంలో హిందూ దేవాలయాలపై జరిగిన దాడులు, లడ్డూ ప్రసాదం అపవిత్రతకు బాధ్యత వహిస్తూ జగన్ మోహన్ రెడ్డి , ఆయన అనుచర వర్గం హిందూ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో నెయ్యి టెండర్ల ప్రక్రియలో టిటిడి బోర్డుపెద్దలు నియమ నిబంధనలను మార్చి, అప్పటివరకు ఉన్న నిబంధనల ప్రక్రియను పూర్తిగా తుంగలో తొక్కారని, వారికి అనుకూలమైన వ్యక్తులకు లబ్ది చేకూర్చేలా నిబంధనలు మార్చారని ఆరోపించారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకంపై వైసిపి నేతలు చేస్తున్న అసత్య,అవాస్తవ ప్రచారంపై శుక్రవారం సాయంత్రం పద్మావతి విశ్రాంతి గృహంలో టిటిడి ఛైర్మన్ బి ఆర్ నాయుడుతో కలసి బోర్డు సభ్యులు భాను ప్రకాశ్‌రెడ్డి, సి.దివాకర్‌రెడ్డి,పనబాక లక్ష్మి,నరేష్ కుమార్, దర్శన్‌తో కలసి మీడియా సమావేశం నిర్వహించారు. 2019-24మధ్యకాలంలో తిరుమలకు వచ్చిన నెయ్యిలో వాసన కోసం అత్యంత ప్రమాదకరమైన రసాయనాలు వాడారని, ఇది భక్తుల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనని మండిపడ్డారు. శ్రీవారి ప్రసాదాన్ని అపవిత్రం చేసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, సిబిఐ సిట్ విచారణ, ఛార్జిషీట్‌తో దోషులందరినీ వెలికితీస్తామని అన్నారు. సామర్థం లేని బోలే బాబా డైరీలకు 60 లక్షల కిలోల నెయ్యి సరఫరా ఆర్డర్లు ఇచ్చారని, సుమారు 250 కోట్ల రూపాయల విలువైన ఈ నెయ్యిలో జంతువుల కొవ్వు ఉన్నట్లు ఎన్‌డిడిబి నివేదికల్లో తేలిందని స్పష్టం చేశారు.

సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని...తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

రేణిగుంట జనవరి 30 ప్రభాతవార్త: రేణిగుంట సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేసి పారదర్శకంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. తనిఖీల్లో భాగంగా అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. సబ్ రిజిస్టర్ బాలాజీ, సిబ్బంది,లేఖకులతో సమీక్షించి అన్ని వివరాలను తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ, సేవల వేగవంతం, ప్రజలకు అందుతున్న సౌకర్యాలపై క్షుణ్ణంగా విచారించారు. సేవలు వేగవంతం చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న పత్రాలను 24 గంటల్లో అందించాలని కోరారు. రేణిగుంట సబ్ రిజిస్టర్ కార్యాలయం రాష్ట్రంలో అత్యధిక రెవెన్యూ వచ్చే కార్యాలయాల జాబితాలో ఉందన్నారు. ఇటీవల వస్తున్న ఫిర్యాదులపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ గా ఉందన్నారు. కొంతమంది పై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి గత సబ్ రిజిస్టర్ సస్పెండ్ చేసినట్లు తెలిపారు. విధులను ప్రభుత్వ నియమ నిబంధనలను అనుసరించి నిర్వహించాలని సూచించారు. తనిఖీల్లో జిల్లా రిజిస్టార్ రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పాన్ని పర్యాటక కేంద్రంగా మారుస్తాం

-5కోట్లతో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి శంకుస్థాపన
-పొరుగు రాష్ట్రాల పర్యాటకుల్ని ఆకర్షించేలా పనులు
-డిస్కవర్ కుప్పం టూరిజం వెబ్‌సైట్ ప్రారంభం
-కుప్పం పర్యటనలో సిఎం చంద్రబాబునాయుడు

విజిటర్స్ పార్కును ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు

కంగుంది కళాకారులతో...స్టాల్స్‌ను సందర్శించిన సిఎం చంద్రబాబునాయుడు

కుప్పం, జనవరి30 ప్రభాతవార్త : కుప్పం ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మార్చేందుకు తగు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని కంగుంది గ్రామంలో 5కోట్ల రూపాయలతో కుప్పం ప్రాంతంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి పనులకు సిఎం శంకుస్థాపన చేశారు. అలాగే కంగుంది హెరిటేజ్ విలేజ్ బౌల్డరింగ్ పార్కును ప్రారంభించారు.అలాగే టూరిజం శాఖ రూపొందించిన డిస్కవర్ కుప్పం టూరిజం వెబ్‌సైట్‌ను, పున్నమి రిసార్ట్స్ హోటల్‌ను సిఎం లాంఛనంగా ప్రారంభించారు. వంద అడుగుల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈసందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కుప్పం ప్రాంతం తమిళనాడు, కర్ణాటకకు సమీపంలో ఉండడంతో పర్యాటక ంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఇక్కడ పొరుగు రాష్ట్రాల పర్యాటకులను ఆకర్షించేలా పనులు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.

కొత్త ఆలోచనలతో అభివృద్ధి చేయాలి :

కుప్పం నియోజకవర్గంలో టూరిజాన్ని కొత్త ఆలోచనలతో అభివృద్ధి చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈసందర్భంగా ప్రభుత్వవిప్ కంచర్ల శ్రీకాంత్, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి.వికాస్ మర్మత్ మాట్లాడుతూ కంగుందితో పాటు రామకుప్పం మండలంలోని ననియాల క్యాంప్‌ను యాభై ఎకరాల్లో అభివృద్ధి చేయడంతో పాటు కాటేజీలు నిర్మించనున్నట్లు సిఎంకు వివరించారు. అలాగే దిబ్బరేవులు, చెలిమిచేను జలపాతాలను సైతం అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కుప్పంలోని పున్నమి టూరిజం హోటల్ నిర్వాహకులతో అక్కడి వసతుల గురించి సిఎం ఆరా తీశారు. ప్రస్తుతం ఇరవై గదులు ఆధునీకరించినట్లు నిర్వాహకులు తెలపడంతో టూరిజం రిసార్ట్‌ను బాగా నిర్వహించాలని ఆదేశించారు.

డాక్యుమెంటరీని ఆసక్తిగా తిలకించిన ముఖ్యమంత్రి :

కడ, తదేకం ఫౌండేషన్, టూరిజం శాఖ అధ్వర్యంలో కంగుందిలో చేపట్టిన బౌల్డరింగ్ ఫెస్ట్, కంగుంది చరిత్రకు సంబంధించిన డాక్యుమెంటరీలను సిఎం చంద్రబాబునాయుడు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా పలువురు పర్యాటకులు సిఎంతో మాట్లాడుతూ కుప్పం ప్రాంతంలో టూరిజం ప్రదేశాలు, కంగుందిలో ఏర్పాటుచేసిన హోంస్టేలు బాగున్నాయని ఆన ందంతో పేర్కొన్నారు. విజిటర్స్ బుక్‌లో సిఎం చంద్రబాబునాయుడు స ్వర్ణకుప్పం, స్వర్ణ కంగుంది అని రాసి సంతకం చేశారు. కార్యక్రమంలో చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్ సురేష్‌బాబు, కార్పోరేషన్‌ఛైర్మన్ రాజశేఖర్, టిటిడి డైరెక్టర్‌వైద్యం శాంతారాం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు,తదేకం ఫౌండేషన్ మేజర్ జనరల్ సంజయ్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

కృష్ణమ్మకు సిఎం చంద్రబాబు జలహారతి :

పట్టణ సమీపంలో ఉన్న కుప్పం చెరువు వద్ద కృష్ణాజలాలకు సిఎం చంద్రబాబునాయుడు శుక్రవారం సాయంత్రం జలహారతిని ఘన ంగా నిర్వహించారు. హంద్రీ-నీవా కాలువల ద్వారా కుప్పం పట్టణానికి కృష్ణాజలాలు వచ్చి చెరువు పూర్తిగా నిండి మరువపారుతుండడంతో సిఎం చంద్రబాబునాయుడు కృష్ణమ్మకు హారతి ఇచ్చారు. కార్యక్రమంలో ప్రభుత ్వవిప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్ సురేష్‌బాబు, టిటిడి డైరెక్టర్ వైద్యం శాంతారాం,మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, కడ సభ్యులు రాజ్‌కుమార్, సతీష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

సీఎం గారు...!
15 వేల మంది విద్యార్థులకు...
తల్లికి వందనం గల్లంతు!

- అయోమయంలో టెన్త్ పాసై ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం విద్యార్థులు - జూన్ నెల నుండి కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూపులు

చిత్తూరు, జనవరి 30 ప్రభాతవార్త: ఒక కుటుంబంలో 1వ తరగతి నుండి ఇంటర్మీడియేట్ చదివే విద్యార్థులు ఎంత మంది వుంటే అంత మందికి తల్లికి వందనం పథకం కింద ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వ హామీ గాలి మాటలు అయ్యాయి. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమై చివరి దశకు వచ్చినప్పటికీ ఇప్పటికీ అత్యధిక మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద నిధులు తల్లుల బ్యాంకు ఖాతాలో జమ కాని పరిస్థితి నెలకొంది. తల్లికి వందనం పథకం కింద తమ బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ అవుతాయని, ఆ మేరకు విద్యా సంస్థల్లో తమ పిల్లలకు చెల్లించాల్సిన ఫీజులు చెల్లించవచ్చునని ఆశతో అనునిత్యం విద్యార్థుల తల్లులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ ఇప్పటి వరకు ఏ ఒక్క తల్లి ఖాతాలో తల్లికి వందనం నిధులు జమ కాలేదు. రాష్ట్రంలో అధికారంలో వున్న కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఒక కుటుంబంలో ఎంత మంది విద్యార్థులు వుంటే అంత మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద ఏడాదికి రూ.15 వేలు జమ చేస్తామని చెప్పింది. ఈ మేరకు అత్యధిక విద్యార్థుల తల్లిదండ్రులు గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి జై కొట్టారు. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది తల్లికి వందనం కింద ఒక కుటుంబంలో ఎంత మంది విద్యార్థులు 1వ తరగతి నుండి ఇంటర్మీడియేట్ వరకు చదువుతుంటే వారందరికి జులై నెలలో తల్లికి వందనం కింద ఒకొక్క విద్యార్థికి రూ.15 వేలు జమ చేసింది. ఒక కుటుంబంలో 5 మంది పిల్లలు చదువుకుంటుంటే ఆ ఐదు మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద నిధులు జమ అయిన సంఘటనలు వున్నాయి. అలాగే కొన్ని కుటుంబాలకు ముగ్గురు పిల్లలు వుంటే ఒక్కరికి మాత్రమే తల్లికి వందనం నిధులు జమ అయిన సంఘటనలు వున్నాయి. అలాగే గత ఏడాది టెన్త్ చదువుతున్న పిల్లలు ఉత్తీర్ణత సాధించి ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరంలో చేరారు. ఆ విద్యార్థులకు ఇప్పటి వరకు తల్లికి వందనం పథకం నిధులు జమ కాలేదు. జిల్లా వ్యాప్తంగా గత మార్చి నెలలో జరిగిన టెన్త్ పరీక్షల్లో 14,739 మంది విద్యార్థులు టెన్త్ ఉత్తీర్ణత సాధించి ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం చేరారు. వీరందరు ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరంలో చేరిన అనంతరం తల్లికి వందనం పథకం నిధుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అయితే ప్రభుత్వం ఇప్పటి వరకు ఇంటర్మీడియేట్ మొదటి ఏడాది చదువుతున్న విద్యార్థులకు తల్లికి వందనం పథకం నిధులు జమ చేయలేదు. సిఎం చంద్రబాబునాయుడు, డిప్యుటీ సిఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్‌లు మాత్రం తల్లికి వందనం పథకం కింద రాష్ట్రంలో ఎంత మంది విద్యార్థులు 1వ తరగతి నుండి ఇంటర్మీడియేట్ వరకు చదువుతున్నారో వారందరికి తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు జమ చేశామని చెప్తున్నారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా గత ఏడాది టెన్త్ పరీక్షలకు హాజరై ఉత్తీర్ణత సాధించి ఇంటర్మీడియేట్ మొదటి ఏడాది చేరిన ఏ ఒక్క విద్యార్థికి ఈ పథకం కింద ఒక్క పైసా జమ కాలేదు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మూడు రోజుల కుప్పం పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఈ విషయంపై స్పందించి టెన్త్ పాసై ప్రస్తుతం ఇంటర్మీడియేట్ చదువుతున్న విద్యార్థులకు తల్లికి వందనం పథకం నిధులు జమ చేయడానికి చర్యలు తీసుకుంటారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశిస్తున్నారు.

మంచు... వరిని ముంచుతుందా!

విపరీతంగా కురుస్తున్న మంచు... ధాన్యం రంగు మారే ప్రమాదం

తొట్టంబేడు,జనవరి 30 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి సత్యవేడు నియోజకవర్గాల్లో రైతులు ఈ సారి అధిక విస్తీర్ణంలో వరి పంటను సాగుచేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఆర్ఎన్ ఆర్, కేఎన్ఎం, ఎంటియు 1010 రకాలు పండించగా సత్యవేడు నియోజకవర్గంలో బిపిటి రకాలు పండించినట్లు సమాచారం. సత్యవేడు నియోజకవర్గంలో మూడు, నాలుగు రోజులుగా కోతలు మొదలయ్యాయి. అయితే శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పంట చేతికొచ్చింది. మరో 20రోజుల్లో కోతలకు సిద్ధమౌతుంది.ఈ సమయంలో వాతావరణం సహకరించటం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే ధర బాగున్నా కోత దశలో విపరీతమైన మంచు కురవటంతో ధాన్యం రంగు మారే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.

ఆరుగాలం కష్టపడే అన్నదాతలకు అన్ని సహకరించినా ఏదో తెలియని ఆందోళన వేధిస్తుంది. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి పంటలు వేసుకున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి,తొట్టంబేడు,మండలాల్లో పోలో మని వరి పంటను పండించుటకు సిద్ధమయ్యారు.ఎడతెరపి లేని వర్షాలతో వరి పంటకు ఎలాంటి తెగుళ్ళు లేదు. పంట బాగా పండింది.ఇప్పటికే బుచ్చినాయుడు కండ్రిగ, వరదయ్యపాళెం ప్రాంతాల్లో బిపిటిలు పండించారు. కొతలు జరుగుతున్నాయి. ఇక్కడ రైతులకు బస్తాకు రూ.1900లు లభిస్తుంది.అ యితే ప్రభుత్వ మద్దతు ధర కూడా 1750లుగా ఉంది.

విపరీతమైన మంచుతో అన్నదాతల్లో ఆందోళన:

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో విస్తారంగా ఆర్ఎన్ ఆర్‌లు, కేఎన్ఎంలతో పాటు ప్రభుత్వం లేవీకి తీసుకునే 1010 రకాలు విస్తారంగా పండించారు. గతంలో ఈ ప్రాంతాల్లో విస్తారంగా బిపిటిలు పండించే వారు. సాధారణంగా ఈ సీజన్లో వరి పంటకు అగ్గితెగులు ఆశిస్తుంది. కానీ ఈ ఏడాది అది కూడా లేదు. కాకుంటే రైతుల్లో గతానుభవాల దృష్ట్యా భయం పోలేదు. పంటలు బాగా ఉన్నా అన్నదాతలు ముందు జాగ్రత్త అంటూ వారి ఇష్టానుసారంగా పంటలపై మందులు పిచికారి చేస్తున్నారు. ఈ ఏడాది ఎరువులు,మందుల దుకాణాల దారులు వ్యాపారాల్లేదని వాపోతున్నారు. కానీ కొత దశలో విపరీతమైన మంచుతో 'ధాన్యం రంగు మారుతుందని' అన్నదాతలు వాపోతున్నారు. అయితే బియ్యం మాత్రం బాగానే ఉంటుందని చెబుతున్నారు. దీని వల్ల వ్యాపారులు రంగు చూపి ధరను కోస్తారని చెబుతున్నారు.

వ్యవసాయాధికారి వివరణ:

రైతుల్లో చోటు చేసుకున్న ఆందోళనకు సంబంధించి వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డిని వివరణ కోరగా సాధారణంగా ఈ సీజన్లో మంచుకురవటం సాధారణమే అన్నారు.అయితే చలి లేదని తాము శుక్రవారం శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు గ్రామ పరిసరాల్లోని పంట పొలాల్లో పరిశీలించామని ఎలాంటి తెగుళ్ళు లేదన్నారు. రంగు మారుతుందనుకోవటం రైతుల భ్రమ అని వ్యవసాయాధికారి వివరించారు.

స్కూల్ బస్సును... ఢీకొన్న కంటైనర్

- 18 మంది విద్యార్థులకు గాయాలు
- బస్సులో ఇరుకున్న ఇద్దరు విద్యార్థులు

బస్సును ఢీకొని బోల్తా పడిన కంటైనర్

శ్రీరంగరాజపురం, జనవరి 30 ప్రభాతవార్త: ఎస్ఆర్ పురం మండలం క్షీరసముద్రం బిసీ కాలనీకి సమీపంలో చిత్తూరు-పుత్తూరు రహదారిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 18 మంది విద్యార్థులు గాయపడ్డారు. భానోదయ ఇంగ్లీషు మీడియం స్కూల్ బస్సును వెనుకవైపు నుండి కంటైనర్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు బస్సులో ఇరుక్కొని వెలుపలి రావడానికి అల్లాడిపోయారు. వివరాలిలా వున్నాయి. జిడినెల్లూరు మండలం ఎట్టేరి గ్రామంలోని భానోదయ ఇంగ్లీషు మీడియం ప్రైవేటు స్కూల్ బస్సు ఎస్ఆర్ పురం మండలం నుండి ప్రతిరోజు విద్యార్థులను స్కూల్‌కు తీసుకెళ్ళేది. శుక్రవారం ఉదయం భానోదయ స్కూల్ బస్సు రావడంతో విద్యార్థులు యధావిధిగా బస్సు ఎక్కారు. ముదికుప్పం, జిఎంఆర్ పురం గ్రామం నుండి విద్యార్థులను ఎక్కించుకుని వస్తుండగా క్షీరసముద్రం బిసీ కాలనీ వద్ద విద్యార్థులు బస్సు ఎక్కాల్సి వుండటంతో బస్సు నిలిచింది. బస్సులోకి విద్యార్థినిలు ఎక్కుతున్న సమయంలో చెన్నై వైపు నుండి వేగంగా వస్తున్న కంటైనర్ స్కూల్ బస్సును వెనుక నుండి ఢీ కొంది. ఈ క్రమంలో స్కూల్ బస్సు నుజ్జు నుజ్జు అయ్యింది. అక్కడ ఏం జరిగిందని తెలుసుకునేలోపే స్కూల్ బస్సులో వున్న విద్యార్థులు అహాకారాలు, అర్తనాదాలతో పరిసరాలు దద్దరిల్లాయి. బస్సులో 18 మంది విద్యార్థులు వుండగా అందరు గాయపడ్డారు. ఇందులో ఇద్దరు విద్యార్థుల కాళ్ళు బస్సు సీటులో ఇరుక్కుపోవడంతో వెలుపలికి రాలేకపోయారు. స్థానికులు కట్టర్ సహాయంతో బస్సు సీట్‌ను కోసి వేసి ఇద్దరు విద్యార్థులను వెలుపలికి తీశారు. గాయపడిన విద్యార్థులను ఎస్ఆర్ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు తీసుకెళ్ళి చికిత్స నిర్వహించారు. ఈ ప్రమాదంలో ఎగువ ముదికుప్పం గ్రామంకు చెందిన కుషాన్(8), తేజస్వంత్(13), గుణశ్రీ(13) లకు తీవ్ర గాయాలు అయ్యాయి. అలాగే జిఎంఆర్ పురం గ్రామంకు చెందిన లతీష్, తులసీలకు సైతం గాయాలు అయ్యాయి. తీవ్రంగా గాయపడిన 13 మంది విద్యార్థులకు మెరుగైన చికిత్స నిర్వహించడానికి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి మరింత మెరుగైన వైద్యం అందించ డానికి ముగ్గురు విద్యార్థులకు చీలాపల్లి సిఎంసి ఆసుపత్రికి తీసుకెళ్ళారు. అలాగే గుణశ్రీని తిరుపతికి, తేజస్వంత్, కుషాన్‌లను రాణిపేట సిఎంసి ఆసుపత్రికి తరలించారు.ఎస్ఐ సుమన్ కేసునమోదు చేసిదర్యాప్తు చేస్తున్నారు.

గాయపడ్డ విద్యార్థులకు మెరుగైన వైద్యం
- కలెక్టర్ సుమిత్‌కుమార్

శ్రీరంగరాజపురం మండల పరిధిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ స్కూల్ విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించడానికి రాణిపేట సిఎంసి యాజమాన్యంతో మాట్లాడి చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో విద్యార్థులు ఎవ్వరికి ప్రాణాపాయం లేదని అందరు సురక్షితంగా వున్నారని కలెక్టర్ పేర్కొన్నారు.

వైద్య ఖర్చులు ప్రభుత్వం భరిస్తుంది
- ప్రభుత్వ విప్ డాక్టర్ విఎం థామస్

శ్రీరంగరాజపురం మండల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి, చీలాపల్లి సిఎంసి ఆసుపత్రి, రాణిపేట సిఎంసి ఆసుపత్రి, తిరుపతి ఎలైట్ ఆసుపత్రి డాక్టర్లతో మాట్లాడి చర్యలు తీసుకున్నట్లు ప్రభుత్వ విప్ డాక్టర్ విఎం థామస్ పేర్కొన్నారు.

భూ సమస్యలు సత్వరమే పరిష్కరిస్తాం
- జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు

వినతి పత్రాలు స్వీకరిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్

వెంకటగిరి, జనవరి 30 ప్రభాతవార్త : భూ సమస్యలు సత్వరమే పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ క్లినిక్లు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్ గోవిందరావు తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని వింజల వీరయ్య కల్యాణ మండపంలో వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలకు సంబంధించి రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సంయుక్తంగా నిర్వహించారు. వెంకటగిరి జెసి, ఎమ్మెల్యే రెవెన్యూ క్లినిక్ నిర్వహించారు. గ్రామాల్లో అనేక భూ సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు రెవెన్యూ క్లినిక్ పేరుతో వినతి పత్రాలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే కురుగొండ్లరామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక రెవెన్యూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు ప్రజల వద్దకే వచ్చి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఎప్పుడు అందరికీ అండగా ఉంటుందని తెలిపారు. హ్యాండ్లూమ్ టెక్నాలజీ వద్ద ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమిస్తున్నట్లు 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూములు వెంకటగిరి పట్టణంలో ఆక్రమణ గురవుతున్నట్లు చెప్పారు. శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా భూ సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. సమస్యలను వినతి పత్రాలు ద్వారా ఇస్తే పరిష్కరిస్తామని చెప్పారు. అధికార యంత్రంగా మొత్తం ప్రజల వద్దకే వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎల్డిఓ సుస్మితా రెడ్డి, సర్వే ఏడి అరుణ్ కుమార్, సర్వే డిప్యూటీ డైరెక్టర్ రాఘవయ్య, తహసిల్దారులు నరసింహారావు, విజయలక్ష్మి, శ్రీనివాసులు, టిడిపి నాయకులు బేరం రాజేశ్వరరావు, కోటేశ్వరరావు, సీసీ నాయుడు, ఏలేశ్వరం రామచంద్ర నాయుడు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం

కుప్పం, జనవరి 30 ప్రభాతవార్తం మూడు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా సిఎం చంద్రబాబునాయుడు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అగస్త్య ఫౌండేషన్ అకాడమీలో విద్యాచల్ అకాడమీ, ఐదువేలమంది ఉపాధ్యాయులకు ఒకేసారి శిక్షణ ఇచ్చేలా నిర్మించిన టీచర్స్ ట్రైనింగ్ సె ంటర్ కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే లెర్నర్ అకామిడేషన్ సెంటర్‌తో పాటు కుప్పం పట్టణంలో ఆదిత్య బిర్లా గ్రూప్ సహకారంతో ఏర్పాటుచేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను(నవదిశ), కోవర్కింగ్ స్పేస్ సెంటర్‌ను సైతం సిఎం చంద్రబాబునాయుడు లాంఛనంగా ప్రారంభించారు. ఇక్కడ పారిశ్రామికఅవసరాలకు తగిన విధంగా యువతకు శిక్షణ ఇ

దళిత గిజనులసమస్యల పరిస్కారంకు చర్యలు.

పెద్దపంజాణి, జనవరి30 ప్రభాతవార్త: ప్రభుత్వం ఆదేశాల మేరకు దళిత గిజన కాలనీలో ప్రజల సమస్యలపరిస్కారని తగుచర్యలు తీసుకుంటున్నట్లు తహశీల్దార్‌హనుమంతు నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దవెలగటూరు గ్రామపరదిలోని సికారిపాళ్యం ఎస్టీకాలనీలో పౌరహక్కుల దినోత్సవ గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలుసమస్యలను ప్రస్తావించగా వాటిని త్వరలోనే పరిస్కరిస్తామని తహశీల్దార్ హామీఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపిడిఓ, ఈఓపిఆర్‌డి శారదాదేవి, ఎస్సై మారప్ప,మండలస్థాయి అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

పెద్దపంజాణి జనవరి 30 ప్రభాతవార్త: ఉద్యోగ, ఉపాధ్యాయులు సమస్యలను త్వరతిగతిన పరిష్కరిం చా లని ఎస్టీయూ నాయకులు శుక్రవారం తాహశీల్దార్ హనుమంతునాయక్‌కు వినతిపత్రం అందించారు. సంఘనేతలు మాట్లాడుతూ ఉద్యోగులు,ఉపాధ్యాయులు పెన్సన్‌ర్లకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను పేస్లిప్పులో చూపించి వెంటనే చెల్లించాలన్నారు. సిపిఎస్ రద్దుచేసి పాత పెన్సన్‌విధానంను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయు మండల అధ్యక్షులు బాబూరెడ్డి, ప్రధానకార్యదర్శి గురుప్రసాద్, వాసు, అంజాద్ ఆలీఖాన్, నారాయణస్వామి, శివప్రకాశ్ బాబు, రెడ్డివిజయ, నీరజ, శోభ, అనూస, అరుణ, జయంతి, దేవరాజు, మెహ్మద్‌రఫీ, సురేంద్ర, లక్ష్మీపతి, నాగరాజు, బాలాజీ, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

ఫోక్సో కేసులో నిందితుడికి 20 సంవత్సరాలు జైలు

చిత్తూరు, జనవరి 30 ప్రభాతవార్త: ఫోక్సో కేసులో నిందితుడికి 20 నెలల జైలు, 3 వేల రూపాయల జరిమానా విధిస్తూ ఫోక్సో కోర్టు స్పెషల్ జడ్జి ఎం.శంకర్‌రావు శుక్రవారం తీర్పు వెలువరించారు. గుడిపాల మండలం అనుపు గ్రామంకు చెందిన ఎస్.దిలీప్‌కుమూర్(40) భార్య మృతి చెందడంతో ఇద్దరు కుమారులతో వుంటున్నాడు. ఈ క్రమంలో తన కుమారుడితో పాటు ఇంటికి వస్తుండిన 14 సంవత్సరాల మైనర్ బాలికపై కన్నేసిన దిలీప్‌కుమార్ బాలికతో మోసపూరిత మాటలు చెప్పి తనను పెళ్ళి చేసుకుంటానని, మంచి జీవితం ప్రసాదిస్తానని నమ్మించి 2022 సంవత్సరంలో బాలిక తన ఇంటికి వచ్చిన సందర్భంలో ఆమెను వివస్త్ర చేసి తాను అడ్డుకుంటున్నా బలవంతంగా శారీరకంగా అనుభవించాడు. ఆపై ఈ విషయంను ఆసరాగా తీసుకుని ఆ బాలికను దిలీప్‌కుమార్ పలు పర్యాయాలు శారీరకంగా ఆమెను అనుభవించాడు. 2022 ఫిబ్రవరి 22వ తేదీ బాలిక తల్లిదండ్రులతో సమ్మతి లేకుండా ఆమెను పిలిపించుకుని బలవంతంగా మాపాక్షికి తీసుకెళ్ళి కరుపుస్వామి ఆలయంలో తనను పెళ్ళి చేసుకుంటున్నట్లు నమ్మించడానికి రోల్డ్ గోల్డ్ చైన్‌తో తాళి కట్టి తనను తీసుకుని కర్ణాటక రాష్ట్రంలో కొన్నాళ్ళపాటు కాపురం చేశాడు. ఆపై తనను గర్భవతిని చేసి అక్కడ పనులు దొరకలేదని చెప్పి తనను తీసుకువచ్చి 2022 డిసెంబర్ 13వ తేదీ చిత్తూరు బస్ స్టేషన్‌లో వదలి వెళ్ళిపోయాడు. ఆపై ఆ బాలికను తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్ళి జరిగిన విషయాలను అడిగి తెలుసుకుని గుడిపాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గుడిపాల పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసును విచారించిన ఫోక్సో కోర్టు నిందితుడికి 20 సంవత్సరాల పాటు కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది.

32 మందికి రూ.77 వేల జరిమానా

చిత్తూరు, జనవరి 30 ప్రభాతవార్త: చిత్తూరు వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడిన 32 మందికి సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరు పరిస్తే వారికి 77 వేల రూపాయల జరిమానా విధించినట్లు ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ తెలిపారు. చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం పోలీసులు తనిఖీలు నిర్వహించిన సమయంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 5 మంది పట్టుబడ్డారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ 27 మంది పట్టుబడ్డారు. ఈ మేరకు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 5 మందిలో ఒకొక్కరికి 10 వేల రూపాయలు చొప్పున 50 వేల రూపాయలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడిన 27 మందికి ఒకొక్కరికి వెయ్యి రూపాయలు చొప్పున 27 వేల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఇన్స్‌పెక్టర్ వివరించారు.

పద్మావతి వర్సిటీలో ముగిసిన సదస్సు

యూనివర్సిటీ(తిరుపతి), జనవరి 30 ప్రభాతవార్త: ఇంటర్నేషనల్ (మ్యాచింగ్ గ్రాంట్) ప్రాజెక్ట్ పరిశోధకుల ఆధ్వర్యంలో ఉన్నత విద్యా సంస్థల్లో హరిత ఆవిష్కరణల వాణిజ్యీకరణకు న్యాయ పరమైన రూపరేఖలు – విధానాలు, అడ్డంకులు, వ్యూహాల విశ్లేషణ" అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించారు. రెండో రోజు కార్యక్రమం సమర్థవంతమైన వాణిజ్యీకరణకు వ్యూహాలు" అనే సాంకేతిక సెషన్‌తో ప్రారంభమై, ఆచార్య శివ రామమూర్తి సందర్భానుగుణ వాణిజ్యీకరణ వ్యూహాల రూపకల్పన, సెల్స్ సమర్థత పెంపుపై ఉపన్యాసం ఇచ్చారు. ప్రొఫెసర్ జె. సూర్యకుమార్, , ప్రొఫెసర్లు డా. ఎస్. ఉష, ప్రొఫెసర్ శివ రామమూర్తి, ప్రొఫెసర్ సి. రాజశేఖరన్ పాల్గొని ఆంధ్రప్రదేశ్‌లోని ఉన్నత విద్యా సంస్థల్లో స్థిరమైన వాణిజ్యీకరణ మార్గాలపై ఉత్తమ విధానాలను చర్చించారు. చివరగా నిర్వహించిన ప్యానల్ చర్చలో ప్రొఫెసర్ టి. సీతాకుమారి, ప్రొఫెసర్ పి. ఉమా మహేశ్వరి దేవి, డా. సాయిరాం భట్, ప్రొఫెసర్ వి. రాజ్యలక్ష్మి విధాన ముసాయిదా తయారీ, పాలసీ బ్రీఫ్ అభివృద్ధి మరియు ఉన్నత విద్యలో న్యాయ సంస్కరణలకు కార్యాచరణాత్మక రూపరేఖపై చర్చతో ముగిసింది.

భగవంతుని ఆశీస్సులందుకున్నాం

తిరుమల,జనవరి 30ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులందుకున్నట్లు నగరి ఎమ్మెల్యే గాలిభా నుప్రకాశ్ తెలిపారు. శుక్రవారం ఉదయం కుటుంబంతో కలసి ఆలయం లోనికి చేరుకున్నారు.శ్రీవారిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉభయదేవేరులతో గోవిందకాజస్వామి తెప్పపై విహారం

తిరుపతి,జనవరి 30ప్రభాతవార్త: గోవిందరాజస్వామి ఆలయ వార్షిక తెప్పోత్సవాల్లో ఐదవరో శుక్రవారం సాయంత్రం శ్రీదేవిభూదేవిసమేగ గోవిందరాజస్వామి భక్తులను కటాక్షించారు. సాయంత్రం 6.30గంటలకు తెప్పపై ఏడు చుట్లు విహరించి భక్తులకు అభయమిచ్చారు. పెద్దజీయర్ స్వామి,చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి, ఎఈఓ నారాయణచౌదరి, సూపరింటెండెంట్ శేషగిరి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనంజయ,అర్చకులు పాల్గొన్నారు.

పోలీస్ కానిస్టేబుల్ కుటుంబానికి...రూ.1.10 కోట్ల చెక్కు అందజేత

తిరుపతి, జనవరి 30 ప్రభాతవార్త:

రోడ్డుప్రమాదంలో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ వి. అయ్యప్ప కుటుంబానికి లక్ష రూపాయలు చెక్కు జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు అందజేశారు. అనారోగ్య కారణాలతో మృతి చెందిన కె. శ్రీనివాసరావు కుటుంబానికి తక్షణ సహాయం క్రింద మంజూరైన లక్షరూపాయలు చెక్కును ఎస్పీ కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏఓ శ్రీ సురేష్ బాబు, సిబ్బంది వెంకటేష్ ,వెంకటేశ్వర రావు పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సోము పాల్గొన్నారు.

రైల్వే కోడూరు డివిజన్

యువత గాంధీజీ మార్గాన్ని ఎంచుకోవాలి



రైల్వేకోడూరు,జనవరి 30 ప్రభాతవార్త: రాష్ట్రంలోని యువత మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నడవాలని రైల్వేకోడూరు టిడిపి ఇన్చార్జి ముక్కా రూపనంద రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలతో వర్ధంతి నివాళిని అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్రం కోసం నిరంతరం పోరాటంలో గాంధీజీ పాత్ర ఎంతో ముఖ్యమైనదని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, పోకల సుబ్రహ్మణ్యం (మణి), పటాన్ మోల, డి కృష్ణంరాజు, శేఖర్, తిప్పన రాజశేఖర్, కొప్పరపు అరవింద్, గడికోట సుబ్బరాయుడు తో పాటు కూటమికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

కల్తీ నెయ్యి పాపం...వైసిపి ప్రభుత్వందే

పుల్లంపేట, జనవరి 30 ప్రభాతవార్త: పుల్లంపేట మండలం వత్తలూరు పంచాయతీలోని లేబాకువారిపల్లె గ్రామంలో శుక్రవారం రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి కుడా చైర్మన్ ముక్కారూపానందరెడ్డి రామాలయం ను శుద్ధి చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్రమైన తిరుమలను కల్తీ నెయ్యితో లడ్డులను తయారుచేసి భక్తుల మనోభావాలను తీవ్రంగా వైసిపి ప్రభుత్వం దెబ్బతీసిందని అలాంటి పాపం పోవాలంటే రాష్ట్రంలోని ప్రజలందరూ ఆయా గ్రామాల పరిధిలోని వారందరూ దేవాలయంలో శుద్ధి చేసి ప్రత్యేక ప్రార్థన చేయాలన్నారు లేకుంటే వైసిపి ప్రభుత్వం చేపట్టిన కల్తీ నెయ్యి పాపం ఊరికే పోదన్నారు. అనంతరం వత్తలూరు పంచాయతీలోని దాదాపు 48 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్లు నిర్మించేందుకు రెడ్డిపల్లి పంచాయతీలో, 20 లక్షలకు రంగంపల్లి పంచాయతీలోని ఉప్పరపల్లిలో 10 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు కు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు.పుల్లంపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు, కావేటి వెంకటసుబ్బయ్య యాదవ్, మాజీ అధ్యక్షుడు ఆరే సుధాకర్ నాయుడు, మారోతు మల్లికార్జున దేవినేని శ్రీరాములు గురుస్వామి నాయుడు, రామచంద్రయ్య నాయుడు, శంకర్ రెడ్డి, భీమిశెట్టి నారాయణ కృష్ణారెడ్డి శివయ్య నాయుడు ప్రేమ్ కుమార్ పెంచలయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు

మృతుని కుటుంబ సభ్యుల వేడుకోలు

బైరెడ్డిపల్లి, జనవరి 30 ప్రభాతవార్త: బైరెడ్డిపల్లి మండలం ధర్మపురి పంచాయితీ కేంద్రంలోని గుర్రప్ప కుమారుడు గంగాధర అనే యువకుడు గత మూడు నెలలకు పూర్వం తుఫాను కారణం చేత, ప్రమాదవశాత్తు మరణించడం జరిగినది.కూలీ పనికి వెళ్ళినప్పుడు ప్రమాదవశాత్తు గోడ తనపై పడిపోయి అక్కడికక్కడే మృతి చెందడం జరిగినది.ఈ వ్యక్తి హరిజన కులానికి చెందిన దళితుడు. గంగాధరంకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.తండ్రి లేని కారణం చేత తల్లిని తన కుటుంబాన్ని ఆయనే పోషించేవాడు.ఎటువంటి పొలము గాని,ఆదాయం గాని లేదు. ప్రభుత్వం నుండి ఏదైనా సహాయం వచ్చేటట్లయితే వచ్చే విధంగా చర్యలు తీసుకొని,తమ కుటుంబాన్ని కాపాడాలని వారు పత్రికా ముఖంగా తెలియజేయడం జరిగినది.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రామకుప్పం,జనవరి 30 ప్రభాతవార్త: శాంతిపురం మండలాలకు ఖాళీగా ఉన్న అంగన్వాడి పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి కల్పన తెలిపారు. రామకుప్పం అంగన్వాడి కార్యకర్తలు 2, అంగన్వాడి హెల్పర్లు 35, శాంతిపురం మండలానికి అంగన్వాడీ కార్యకర్త 1, అంగన్వాడి హెల్పర్లు 28 ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. విద్యార్హత పదవ తరగతి పాసై, వివాహిత మహిళగా ఉండాలన్నారు. ఫిబ్రవరి 2 నుంచి శాంతిపురం మండల కేంద్రంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కేంద్రంలో దరఖాస్తులను ఫిబ్రవరి 9వ తేదీ వరకు స్వీకరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రామకుప్పం, శాంతిపురం మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీఎం చంద్రబాబు పర్యటన విజయవంతం చేయాలి

రామకుప్పం,జనవరి 30 ప్రభాతవార్త: చంద్రబాబు నాయుడు మూడు రోజుల కుప్పం పర్యటన సందర్భంగా కూటమి నేతలు కార్యక్రమాలకు తరలివచ్చి విజయవంతం చేయాలని రాష్ట్ర నేత మునస్వామి, మండల అధ్యక్ష ,మాజీ అధ్యక్షులు వెంకటరమణ ఆంజనేయరెడ్డి కోరారు. కుప్పం, శాంతిపురం మండలంలో జరుగు వివిధ కార్యక్రమాల్లో మండలంలోని తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు, బిజెపి,జనసేన పార్టీ వివిధ హోదాలో ఉన్న నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేత నారాయణ చారి, కార్యదర్శి కామరాజు నాయక్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు నరసింహులు, నేతలు శ్రీనివాసులు రెడ్డి, రామ్మూర్తి, చలపతి, చిన్న కృష్ణ, కృష్ణా నాయక్, జయశంకర్, రామకృష్ణప్ప, మహమ్మద్ రఫీ, రవి రెడ్డి, రఘు, బాలురాజు, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఉపయోగాలనువివరించండి

సోమల, జనవరి 30 ప్రభాతవార్త: భూసార పరీక్షల వల్ల రైతులకు జరిగే ఉపయోగాలను వారికి వివరించాలని పుంగనూరు వ్యవసాయశాఖ ఏడిఏ శివకుమార్ అన్నారు. సోమల రైతు భరోసా కేంద్రంలో సోమల, సదుం మండలాల ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బందితో ఆయన అవగాహన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు సుధాకర్ జ్యోతమ్మ పకృతి వ్యవసాయశాఖ అధికారులు రెడ్డిరాణి భువనేశ్వరి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు

దూడల పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

సోమల, జనవరి 30 ప్రభాతవార్త: పాడి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్నపెయ్య దూడల పథకాన్ని సద్వినియోగం చేసుకొని రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మండల జనసేన పార్టీ అధ్యక్షుడు సూరిశెట్టి నాగభూషణం అన్నారు. 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీ గట్టువారిపల్లిలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుధాకర్ పశువైద్య సిబ్బంది భావాజా అలీ, నూర్ మహమ్మద్ అలీ, మధు తదితరులు పాల్గొన్నారు

శ్రీ ఎల్లమ్మ తల్లికి రాహుకాలం అభిషేక పూజలు

కల్లూరు, జనవరి 30 ప్రభాతవార్త: పులిచెర్లలో శ్రీ ఎల్లమ్మ తల్లి ఆలయంలో స్వామి రాజశేఖర్ దీక్షితులు ఆధ్వర్యంలో అమ్మవారికి రాహుకాలంలో జరిగిన అభిషేక పూజ కార్యక్ర మం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థా పక ధర్మకర్త మురళి మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులు, ఎస్వీ రమణ, జై చంద్రారెడ్డి, రమణారెడ్డి, మహేశ్వర్ రెడ్డి, రాము రెడ్డి, రాంబాబు, మహబూబ్ బాషా రెడ్డి, భాష, భక్తులు తదితరులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.

వివక్షతను అంతం చేయాలి

కల్లూరు, జనవరి 30 ప్రభాతవార్త: సమాజంలో కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షతను అంతం చేయాలని, వారికి గౌరవం దక్కేలా చర్యలు చేపట్టాలని పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ కుష్టువ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ఖిస్పర్శ కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమంఖిను ఆయన ప్రారంభించారు. ప్రతి సంవత్సరం జనవరి 30వ తేదీ నుండి ఫిబ్రవరి 13వ తేదీ వరకు స్పర్శ పేరుతో కుష్టువ్యాధి పట్ల అవగాహన కార్యక్రమాలు గ్రామాలలో నిర్వహించడం జరుగుతుం దన్నారు. అనుమానితులను గుర్తించి వ్యాధి నిర్ధారణ కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెఫర్ చేయా లన్నారు. బహుళ ఔషధ చికిత్సతో అంగవైకల్యం రాకుండా కాపాడబడతారన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ శ్రీదేవి, నోడల్ పర్సన్ చంద్రయ్య, పర్యవేక్షకులు పురుషోత్తం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చిట్టిబాబు మృతి పార్టీకి తీరని లోటు

కల్లూరు, జనవరి 30 ప్రభాతవార్త: పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి పంచాయతీ చెరువు ముందరపల్లి వాస్తవ్యులు టిడిపి సీనియర్ నాయకులు, మాజీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు చింతమాకుల చిట్టిబాబు మృతి పార్టీకి తీరని లోటు అని టిడిపి నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భౌతిక కాయానికి పులిచెర్ల మండల సీనియర్ నాయకులు కుమార్ రెడ్డి, పులిచెర్ల మండలం సింగిల్ విండో చైర్మన్ లెక్కల ధనంజయ నాయుడు, రాజంపేట పార్లమెంట్ కోశాధికారి పీ. ఏలుమల్లై, మండల నాయకులు బండ్ల రమేష్, నజీర్,ధరణిప్రసాద్,రాజేష్,చెన్నుపాటిపురుషోత్తంనాయుడు,రాజగోపాల్‌నాయుడునివాళులు అర్పించారు.

భూమి సారం నశిస్తే... రేపటి పంటలు మాయమవుతాయి!

పాలసముద్రం, జనవరి 30 ప్రభాతవార్త: మండలంలోని వన దుర్గాపురం పంచాయతీలో భూమి యొక్క సారవంతము ఎలా పెంచాలని దానిపై అమాక్స్ మరియు రూరల్ యాక్షన్ సంస్థ ఆధ్వర్యంలో ఒక్కరోజు పంచాయతీ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు భూమి యొక్కభూమి యొక్క సారవంత క్రమంగా తగ్గిపోవడం వ్యవసాయ రంగానికి తీవ్రమైన ప్రమాదంగా మారుతోంది అనిరసాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం, ప్లాస్టిక్ కాలుష్యం, నీటి దుర్వినియోగం వల్ల నేలలోని సహజ పోషకాలు నశిస్తున్నాయి వారు తెలిపారు. భూమి సారాన్ని కాపాడుకోవాలంటే ముందుగా సేంద్రియ వ్యవసాయ విధానాలను అమలు చేయాలి. పశువుల ఎరువు, పచ్చి ఎరువులు, వర్మి కంపోస్ట్ వంటి సహజ వనరుల వినియోగం నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పంటల మార్పిడి విధానం పాటించడం ద్వారా నేలపై వచ్చే ఒత్తిడి తగ్గుతుంది. ఈ రోజు భూమిని కాపాడితే.. రేపటి తరాలకు ఆహార భద్రత నిలుస్తుందనీ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్టిబాబు, నాగరాజు, బిజి నాయుడు మరియు రైతులు పాల్గొన్నారు.

మా జగన్ మోహన్ రెడ్డిని విమర్శించే స్థాయి షర్మిలకు లేదు

రైల్వేకోడూరు, జనవరి 30ప్రభాతవార్త: మా మాజీ ముఖ్యమంత్రి సంక్షేమ రథసారథి వైయస్ జగన్మో హన్‌రెడ్డిని పాదయాత్ర ఎందుకు అన్న మాటలను షర్మిల అనకూడదని రైల్వేకోడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గురువారం వైఎస్ఆర్ షర్మిల జగన్మోహన్ రెడ్డిని పాదయాత్ర చేయుటకు జగన్మోహన్ రెడ్డికి అర్హత లేదన్నడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని అన్నారు. అప్పట్లో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వారితో పాటు మీరు కూడా పాదయాత్ర చేశారని ఈ విషయాన్ని గుర్తించుకోవాలన్నారు.

ఘనంగా గాంధీ వర్ధంతి వేడుకలు

చిట్వేలి, జనవరి 30 ప్రభాతవార్త : మహాత్మా గాంధీ 78వ వర్ధంతి వేడుకలను స్థానిక టిడిపి పార్టీ కార్యాలయంలో మండల బాధ్యుడు కాకర్ల నాగార్జున ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త విశ్వేశ్వర నాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొని గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు లారీ సుబ్బారాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ వెంకటేష్ రాజు, సుబ్బరాజు,పెరుగు వెంకట సుబ్బయ్య, తుంగా చంద్రశేఖర్, ఆవులకుంట్ల సుబ్రహ్మణ్యం,అద్భుత్ కుమార్, రాయపు చంద్రమోళి తదితరులు పాల్గున్నారు.

కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమం

చిట్వేలి, డిసెంబర్ 30 ప్రభాతవార్త: గాంధీజీ వర్ధంతి సందర్భంగా స్పర్శ లేని మచ్చలు వల్ల కలిగే ఇబ్బందులను తెలియపరుస్తూ స్థానిక ఉన్నత పాఠశాలలో సర్పంచ్ దండు లక్ష్మి ఆధ్వర్యంలో,హెచ్ఎమ్ దుర్గరాజు అధ్యక్షతన, వైద్యులు అన్సారి సూచన మేరకు హెల్త్ సూపర్వైజర్ ఇస్మాయిల్ భాషా శుక్రవారం కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్పర్శ లేని మచ్చలు, పొడలు ప్రారంభ దశలో గుర్తించినట్లయితే పూర్తిగా మందులతో నయం చేయవచ్చని విద్యార్థులకు సూచించారు. నిర్లక్ష్యం చేస్తే అంగవైకల్యం, కంటిచూపు దెబ్బ తినడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎం.ఎల్ హెచ్ పి కల్పన, ఏఎన్ఎం కృష్ణవేణి, ఆశలు పద్మ, కన్యాకుమారి సహ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

కుప్పానికి కేంద్రీయ విద్యాలయ మంజూరు

కుప్పం, జనవరి 30 ప్రభాతవార్త: సిఎం చంద్రబాబునాయుడు చొరవతో కుప్పం సిగలో మరో ప్రతిష్ఠాత్మక విద్యాలయం ఏర్పాటుకానుంది. కేంద్ర ప్రభుత్వం కుప్పంలో కేంద్రీయవిద్యాలయ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చింది. ఈ ఏడాది నూతన విద్యా సంవత్సరం2026-27 నుంచే కేంద్రీయ విద్యాలయ కార్యకలాపాలు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేసింది. నూతన భవనాలు నిర్మితమయ్యే దాకా ద్రవిడ వర్సిటీలోని పెరియార్ భవన్‌లో కేంద్రీయ విద్యాలయ నిర్వహణకు సూచించారు. ఒకటినుంచి ఐదవ తరగతి వరకు తరగతులు ప్రారంభించనున్నారు.

వాటర్ ట్యాంకు బోల్తా.. హుటాహుటిన తొలగించిన పోలీసులు

గుడుపల్లె, జనవరి 30 ప్రభాతవార్త: కుప్పం – గుడుపల్లె ప్రధాన రహదారిలో కోటపల్లి వద్ద శుక్రవారం మధ్యాహ్నం ఓ వాటర్ ట్యాంకర్ లింకు తెగి బోల్తా పడింది. అయితే ఈ సంఘటనలో ఎవరికి గాయాలు కాలేదు. అదే మార్గంలో సిఎం చంద్రబాబునాయుడు రానున్న నేపథ్యంలో పోలీసు అధికారులు హుటాహుటిన వాటర్ ట్యాంకరును రోడ్డుపై నుంచి తొలగించి కాన్వాయ్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

మాజీ సర్పంచ్ వెంకటరత్నం మృతి

పలమనేరు, జనవరి 30 ప్రభాతవార్త: పలమనేరు రూరల్ మండలం కొలమాసనపల్లె మేజర్ పంచాయితీ మాజీ సర్పంచ్, తెలుగుదేశం సీనియర్ నాయకుడు ఎ.వెంకటరత్నం (71)మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంగా వున్న ఈయన శుక్రవారం మధ్యాహ్నం కొలమాసనపల్లెలో తన స్వగృహంలో గుండెపోటుతో మృతిచెందారు. ఈయన భార్య శమంతకమణి ఒక సారి సర్పంచ్‌గా పనిచేశారు. అన్ని ఎన్నికల్లోనూ కొలమాసనపల్లె పంచాయితీలో తెలుగుదేశం పార్టీ మెజార్టీ వచ్చే విధంగా పార్టీని బలోపేతం చేశారు. ప్రస్తుతం సర్పంచ్, జడ్పీటిసి, ఎంపిటిసిలు కూడా తెలుగుదేశం పార్టీకి చెందినవారే కావడం గమనార్హం. ఈయన మృతితో తెలుగుదేశం పార్టీకి తీరని లోటైంది.

మహాత్ముని మరచిన నేటి తరం నేతలు

పలమనేరు, జనవరి 30 ప్రభాతవార్త: జాతిపిత మహాత్మాగాంధీని నేటి తరం నేతలు మరిచిపోయారు. సభలు సమావేశాల్లో మహాత్మాగాంధీని ఆయన ఆశయాలు కొనసాగించాలని, అడుగుజాడల్లో నడవాలని ఆకాశానికి ఎత్తే నాయకులు ఈ నెల 30న ఆయన 78 వర్ధంతి సందర్భంగా కనీసం పూల మాలలు వేసే వారు కూడా కరువయ్యారు. పలమనేరు బాపూజీ పార్కులో ఉన్న విగ్రహానికి కేవలం హ్యూమన్ రైట్స్ నాయకులు మాత్రమే మొక్కుబడిగా పూల మాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు, జడ్పీటిసిలు, ఎంపిటిసిలు, కనీసం పూరపాలక సంఘం అధికారులు, కౌన్సిలర్లు, పుర ప్రముఖులు, స్వాతంత్ర్య సమరయోధుల

తిరుమల పవిత్రతను కాపాడుకుందాం

తిరుపతి కలెక్టరేట్, జనవరి 30 ప్రభాతవార్త : ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చినప్పటి నుండి సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరుడిని పావుగా చేసి రాజకీయాలు చేస్తున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఉదయ్ వంశీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పద్మావతీ పురంలోని అన్నమయ్య భవన్‌లో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో చేస్తున్న పరిహార హోమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఉదయ్ వంశీ కలిసి దుశ్శాలువతో సత్కరించి,తిరుమలను కాపాడాలంటూ తిరుమల గిరుల చిత్రపటాన్ని బహుకరించారు.వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రా రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి పసుపులేటి సురేష్, రాష్ట్ర యువజన విభాగం సెక్రటరీ మల్లం రవికుమార్ రెడ్డి, సోషియల్‌మీడియావైస్‌ప్రెసిడెంట్ అనిల్ రెడ్డి,బాలాజీ 37వ వార్డు అధ్యక్షుడు,చందూ,నాని పాల్గొన్నారు.

లెప్రసి అవగాహన కార్యక్రమం

వడమాలపేట, జనవరి 30 ప్రభాతవార్త: మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా శుక్రవారం నుంచి లెప్రసి అవగాహన కార్యక్రమం మండలంలోని ఎస్వీ పురంలో నిర్వహిస్తున్నట్లు డా.హర్షవర్ధన్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ స్పర్శ లెప్రసి అవగాహన కార్యక్రమం సచివాలయం వారిగా ప్రతి గ్రామంలో స్కూళ్ళలో, ద్వాక్రా, అంగన్‌వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సహకారంతో గ్రూప్ మీటింగ్స్ నిర్వహించి కార్యక్రమం ఉద్దేశం గురించి ప్రజలందరికి అవగాహన కల్పించడం, ప్రపంచ ఆరోగ్య సంస్థ వారు ఇచ్చిన నినాదం వివక్షతను అంతం చేయడం గౌరవాన్ని కాపాడడంప్రజల్లోకి తీసుకెళ్ళడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డా. సందీప్, సూపర్‌వైజర్ మురళి, వెంకటరాజు, హెచ్ఎం గోపాల్, రంగయ్య, నరేష్, సుదర్శన్, శ్యామల, నాగరాని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షలో ఏఎస్‌వోగా ఎన్నికైన ధనుష్ విష్ణు

వడమాలపేట, జనవరి 30 ప్రభాతవార్త: వడమాలపేట మండలం తిరుమండ్యం గ్రామానికి చెందిన ధనుష్ విష్ణు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన గ్రూప్-2 పరీక్షల్లో మొదటి ప్రయత్నంలోనే అసిస్టెంట్ సెక్షన్‌ఆఫీసర్(అమరావతి)గా ఎన్నికయ్యారు. తిరుమండ్యంగ్రామానికి చెందిన ధనుష్ విష్ణు తల్లిదండ్రులు మోహన్, మేఘవల్లి ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు.గ్రూప్-2 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి రాజధానికి అధికారిగా ఎన్నికవడం గర్వకారణమని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంతిమయాత్రకు అవస్థలే

వడమాలపేట,జనవరి 30 ప్రభాతవార్త: చనిపోయిన వారిని కాటికి తీసుకెళ్లాలన్నా ఆ గ్రామస్తులకు అవస్థలు తప్పడం లేదు. ఎన్ని ప్రభుత్వాలు మారినా మా సమస్యలు మారడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. తిరుమండ్యం దళితవాడగ్రామానికి చెందిన దేశమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. శ్మశానానికి తీసుకెళ్ళడానికి దారి లేకపోవడంతో పంట పొలాల్లో తొక్కుకుంటూ గ్రామస్తులు పాడి మోశారు. తమ సమస్యలు ఎప్పుడు తీరుతాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోపాన్ని జయించే వారంటే అల్లాహ్‌కు ఇష్టం : రేహాన్

శ్రీకాళహస్తి,జనవరి 30 ప్రభాతవార్త: సృష్టిలో మనిషికి కోపం సహజమని దానిని జయించిన వారంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టమని హాఫీజే ఖుర్‌ఆన్ రేహాస్ సాహెబ్ అన్నారు. జామియామస్‌జిద్‌లో శుక్రవారం ప్రార్థనల తరువాత ప్రత్యేకంగా సందేశమిస్తూ ఈ నెల షాబాన్ అని రంజాన్‌కు ముందు వచ్చే షాబాన్ మాసం సాక్షాత్తు తనకు సంబంధించినదని మన మహమ్మద్ ప్రవక్త స్వయంగా వివరించారన్నారు. ఈ మాసంలో ఆయన ఉపవాస దీక్షలు పాటించే వారన్నారు. ఈ నెల 15వ రోజు రాత్రంతా మేల్కొని అల్లాహ్‌ను ఆరాధించి తమ తప్పులను క్షమాపణ కోరితే తప్పక కరుణిస్తాడని హదీసుల్లో చెప్పబడి ఉందన్నారు. ఈ నెల 3 మంగళవారం రాత్రి షబ్బెబరాత్ అని ఆ రోజు అల్లాహ్ నుంచి దైవ దూతలు దిగివచ్చి తమ తప్పులను క్షమాపణ కోరే వారి కోసం అన్వేషిస్తుంటారని అలాగే తమ బాధలను మాపాలని కోరే వారి ఆర్తనాదాలను ఆమోదించి పరిష్కరిస్తారని వివరించారు. మరుసటి రోజు ఉపవాస దీక్షలు పాటించవచ్చునన్నారు.

పూజ్య బాపూజీకి నివాళులు

శ్రీకాళహస్తి,జనవరి 30 ప్రభాతవార్త: జాతీపిత పూజ్యబాపూజికి శుక్రవారం తెలుగుదేశం పార్టీ నివాళులర్పించింది. పట్టణ నడిబొడ్డులోని రాజగోపురం ఎదురుగా ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయకుమార్‌నాయుడు మాట్లాడుతూ పూజ్యబాపూజీ అహింసా,సత్యం అనే మార్గాలతో స్వాతంత్ర్యం సాధించారన్నారు.ఈ కార్యక్రమాల్లో క్లస్టర్ ఇన్‌చార్జి పేట బాలాజి, ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి, అద్దంకి హేమంత్‌కుమార్, గాండ్ల కుమార్, యశ్వంత్, నారాయణ,జీలాని,కరీం, సతీష్, నెమళ్లూరు బుజ్జి, అర్యగం, ఎంఎస్‌రెడ్డి, హరినాథ్, ఖాదర్‌బాషా, సాజిద్,భుజాల, పోలూరు శ్రీనివాసులురెడ్డి, కుమార్,జావిద్,మునిరాజా యాదవ్, రజనీకాంత్, ఖలీల్, బాల,మురళి,షాజహాన్, తెలుగుదేశం నాయకులు హాజరయ్యారు.

మైనారిటీ నాయకులకు సన్మానం

తొట్టంబేడు, జనవరి 30 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణంలోని మహమ్మదీయ మసీదులో శుక్రవారం ప్రార్థనల అనంతరం మసీదు మతవల్లి ఎస్.గౌస్మొహిద్దిన్ ఆధ్వర్యంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన ముస్లిం మైనార్టీ నాయకులైన టౌన్ బ్యాంక్ చైర్మన్ షేక్ ఖాదర్బాష, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు షేక్ కరీం, మున్సిపల్ మార్కెట్ డైరెక్టర్ షేక్ షఫీ లను ఘనంగా సన్మానించారు. ఈ వారితోపాటు మహమ్మదీయ మసీద్ కార్యదర్శి మహమ్మద్ , ఇమామ్ ముజామిల్లు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యేచే సన్మానం

శ్రీకాళహస్తి జనవరి 30 ప్రభాతవార్త: వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా అనుబంధ కమిటీల ద్వారా ఏర్పాటు చేసేలా ప్రక్రియలో భాగంగా శ్రీకాళహస్తికి చెందిన షేక్. ఫజల్ ను తిరుపతి జిల్లా మున్సిపల్ విన్ ఉపాధ్యక్షుడుగా నియమించడం హర్షించదగ్గ విషయమని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా షేక్ ఫజల్ ను శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన దుస్సాలవలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైకాపా మైనారిటీ నాయకులు షర్మిల ఠాగూర్, జూమ్లేష, మహబూబ్ బాషా, అస్లాం, పరి ఫరీద్, శివ యాదవ్, షాకీర్, ఆరిఫ్ తదితరులు ఉన్నారు

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

శ్రీకాళహస్తి జనవరి 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎస్‌టియు రాష్ట్రశాఖ ఆదేశాలు మేరకు శ్రీకాళహస్తి మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాల్సిందిగా కోరారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గుణశేఖర్ ప్రధాన కార్యదర్శి వి మధు,జిల్లా అధ్యక్షులు పూడి సుధాకర్ యాదవ్, రాష్ట్ర కౌన్సిలర్ చిర్రి. హరికృష్ణ యాదవ్, జిల్లా ఆదనపు ప్రధాన కార్యదర్శి గుమ్మడి మురళి, జిల్లా ఉపాధ్యక్షులు తొండు కృష్ణయ్య,శ్రీకాళహస్తి డివిజనల్ కన్వీనర్ సురగాని. నాగూర్ నాయకులు శివ కుమార్, మోహన్, దామోదరం, స్టాలిన్, రమణయ్య,శ్రీనివాసులు, హరినాథ రెడ్డి , శ్రీహరి, చంద్రశేఖర్ ,ధన కిషోర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ మద్దతు తెలియజేశారు.

ఎంజీఎం నందు భద్రత అవగాహన కార్యక్రమం

తొట్టంబేడు, జనవరి 30 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలోని ఎంజీఎం స్కూల్ నందు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ దామోదర నాయుడు జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు సందర్భంగా మాట్లాడుతూ పిల్లలందరూ తప్పకుండా ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని అదేవిధంగా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ఈ పరివర్తన కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులకు తెలియజేశారు. అదేవిధంగా జాతీయ రహదారి భద్రత వ్యాసరచన పోటీలలో ఎంజీఎం స్కూల్ విద్యార్థులకు ఫస్ట్ సెకండ్, థర్డ్ బహుమతులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎంజీఎం గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్, ఎంజీఎం స్కూల్ హెడ్మాస్టర్ మునిరత్నం నాయుడు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నివారణ లక్ష్యం : ఏడీఏ రమేష్

శ్రీకాళహస్తి రూరల్, జనవరి 30 ప్రభాతవార్త: రైతులు పంట పొలాల్లో ఎలుకలను సామూహికంగా నివారించినప్పుడే వరి పైరు సురక్షితంగా ఉంటుందని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు(ఏడీఏ) రమేష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఊరందూరు గ్రామ రైతు సేవా కేంద్రంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం రైతులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ రమేష్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పంట పొలాల్లో ఎలుకల నివారణ తగ్గించుటకు బ్రోమో డయోలిన్ 100 సబ్సిడీతో పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సురేంద్రరెడ్డి, వి ఏ ఏ లావణ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జాతిపితకు నివాళులర్పించిన పేటబ్రదర్స్

తొట్టంబేడు, జనవరి 30 ప్రభాతవార్త: మన భారతదేశ స్వాతంత్రం కోసం ఎన్నో త్యాగాలు,పోరాటాలు చేసిన వ్యక్తి మహాత్మా గాంధీ అని ఈ సందర్భంగా నాయకులు తెలుపుతూ ప్రతి ఒక్కరు కూడా న్యాయమార్గంలో నడిచే విధంగా కృషి చేయాలని జనసేన నాయకులైన పేట బ్రదర్స్ అన్నారు. తొట్టంబేడు మండల కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, మనీ, ప్రదీప్ కుమార్, నవీన్, హరి, చందు, జానీ, రాజా, భాను, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు

పద్మావతీ అమ్మవారికి ఘనంగా ఊంజల్‌సేవ

నారాయణవనం, జనవరి 30 ప్రభాతవార్త: నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరుని ఆలయంలో శుక్రవారం ఊంజల్‌సేవ ఘనంగా జరిగింది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు.

తంగంముత్తుకు ఆరు నెలల జైలు శిక్ష

రేణిగుంట, జనవరి 30 ప్రభాతవార్త.. గాజులమండ్యం పోలీసులు అరెస్టు చేసిన అంతర్రాష్ట్ర దొంగ తంగ ముత్తుకు నేరం రుజువు కావడంతో తిరుపతి ఒకటవ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శుక్రవారం ఆరు నెలల జైలు శిక్ష, రెండు వందల రూపాయలు జరిమానా విధించారు. ఈ కేసులో సరైన ఆధారాలు సకాలంలో సమర్పించినందుకు రూరల్ పోలీసులను ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

శ్రీ వస్కోట ఎల్లమ్మ ఆలయంలో భక్తులకు అన్నదానం

-ముఖ్య అతిథిగా టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి

చంద్రగిరి, జనవరి 30ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ వస్కోట ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం టిటిడి పాలక మండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రాకను పురస్కరించుకుని ఆలయ కమిటీ అధ్యక్షుడు అంతరాజ చంద్రశేఖర్ రాధ దంపతులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దాతలు మద్దూరు మునిరత్నం, మద్దూరు సుబ్రమణ్యం భక్తుల సౌకర్యార్థం నిర్మించిన శ్రీ వస్కోట ఎల్లమ్మ బస్ షెల్టర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సంర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల శ్రీవారి దర్శనార్థం శ్రీవారిమెట్టు వఈ కార్యక్రమంలో సర్పంచ్ బి.ప్రవీణ్ రెడ్డి, అంతరాజ కళావతి, మాజీ సర్పంచ్ బాలసుబ్రమణ్యం, గ్రామస్థులు పాల్గొన్నారు.

కుష్టు రోగుల సంక్షేమంపట్ల గాంధీ ప్రత్యేక శ్రద్ధ

చంద్రగిరి, జనవరి 30 ప్రభాతవార్త: కుష్టు రోగుల సంక్షేమపట్ల జాతిపిత మహాత్మ గాంధీ ప్రత్యేక శ్రద్ధ వహించారని మండల హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదర్ అన్నారు. స్థానిక రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ వైద్య సిబ్బంది, కొటాల కోలోకేటెడ్ చంద్రగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం వేర్వేరుగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టవర్ క్లాక్ వద్ద ఆయన మాట్లాడుతూ కుష్టు రోగులకు మహాత్ముడు చేసిన సేవలను గుర్తించి ఆయన అమరులైన జనవరి 30న కుష్టు వ్యాధి నివారణ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మధుసూదన్ రావు, డాక్టర్ సౌమ్యప్రియ, డాక్టర్ రేవతి, పిజి డాక్టర్ హరిత, డాక్టర్ కుసుమ, డిప్యూటి హెచ్ఈఓ ఎం.టాటాబాయి, పి.హెచ్.ఎన్.శ్యామల, తులసీరామ్, హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్స్, థర్డ్ ఇయ్యర్ మెడిసిన్ విద్యార్థులు, ట్రైనీ విద్యార్థులు పాల్గొన్నారు.

ముళ్ళకంచె వేసి దారిని అడ్డుకుంటున్నారు

రామచంద్రాపురం, జనవరి 30 ప్రభాతవార్త: దశాబ్దాలుగా తమ రాకపోకలకు వినియోగించుకుంటున్న రహదారికి ముళ్ళ కంచె వేసి అడ్డుకుంటున్నారని వేమారెడ్డి నగర్‌కు చెందిన తులసి, సుజాత ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం రామాపురం సమీపంలోని తమ నివాసాల వద్ద బాధితులు విలేకర్లతో మాట్లాడుతూ తమకున్న రెండెకరాల వ్యవసాయ పొలంలో నివాసం ఏర్పరుచుకుని పొలంలో పశుగ్రాసం పెంచుకుంటూ పశుపోషణతో జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. ప్రదాన రహదారి నుండి తమ పొలంలోనికి వెళ్ళే దారిలో సి.రామాపురం, హరిజన వాడకు చెందిన బాలకృష్ణ, ఆయన కుమారుడు తేజ ఇద్దరూ కలసి ధౌర్జన్యంగా ముళ్ళకంచె వేసి తమను అడ్డుకుంటున్నట్లు వాపోయారు. ఈ విషయమై ఉన్నతాధికారులుస్పందించితమదారిసమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కన్నీటి పర్యంతమయ్యారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

సత్యవేడు, జనవరి 30 ప్రభాతవార్త: సత్యవేడు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సత్యవేడు శాఖలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు, సత్యవేడు శాఖ ఆధ్వర్యంలో తిరుపతి అగర్వాల్ మెడికల్ ఆస్పత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం బ్యాంకు వారికి ఉచిత సేవలను నిర్వహించారు. మేనేజర్ పి.సుబ్బారావు మాట్లాడుతూ ప్రజలకు ఎలవేళలా అందుబాటులో ఉండే బ్యాంకు మన ఆంధ్ర బ్యాంకు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని సిబ్బంది కలసి శిబిరాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో మొత్తం 100 మంది కస్టమర్లు పాల్గొనగా వచ్చిన ఖాతాదారులకు తిరుపతి అగర్వాల్ మెడికల్ ఆస్పత్రి వైద్యులు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి చికిత్సపై సూచనలు ఇచ్చారు.

వైభవంగా ముగిసిన తిరుణాళ్ళ

పుత్తూరు రూరల్, జనవరి 30 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలో వెలసిన శ్రీ కావమ్మ మారయ్య తిరుణాళ్లు శుక్రవారంతో ముగిసింది. మూడు రోజులు పాటు ఈ తిరుణాళ్ళు నిర్వహించారు. శుక్రవారం ఉదయం స్వామివారికి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. అమ్మవారిని చందనంతో అలంకరించి, సాయంత్రం ఆలయ ఆవరణలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై పొంగళ్లు పెట్టి అమ్మవారికినైవేద్యంగా సమర్పించారు. అనంతరం అగ్నిగుండ ప్రవేశంలో భక్తులు పసుపు బట్టలు ధరించి అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమం నిర్వహించారు.

ఉపాధిహామీ చట్టం పేరును కొనసాగించాలని: సీపీఎం

పుత్తూరు రూరల్, జనవరి 30 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలో మెయిన్‌స్కూలులో ఉన్న గాంధీ విగ్రహానికి ఆయన వర్ధంతిసందర్భంగా పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ పుత్తూరు కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం పేరును కొనసాగించాలని డిమాండ్ చేశారు. అదే విధంగామోదీ ప్రభుత్వం మూడోసారి అధికారం లోకి వచ్చి గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని జీఆర్ఏ ఎంజీ పథకాన్ని ప్రవేశపెట్టడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం ఎంపీడీవో కార్యాలయానికి తిరుపతి జిల్లా డ్వామా పీడీ రావడంతో ఆయనకు మహాత్మా గాంధీజాతీయగ్రామీణఉపాధిచట్టం పేరును కొనసాగించాలని ఉపాధి కూలీలతో వినతిపత్రం అందజేశారు.

ఇచ్చిన హామీలకు...వినతిపత్రం

పుత్తూరు రూరల్, జనవరి 30 ప్రభాతవార్త: ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు ప్రభుత్వం మేనిఫెస్టో ఇచ్చిన హామీల అమలకు సంబంధించి రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఎస్టీయూ పుత్తూరు మండలశాఖ శుక్రవారం పుత్తూరు తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలు కోరుతూ రాష్ట్రోపాధ్యాయ సంఘం దశల వారి పోరాటానికి పిలుపునివ్వడం జరిగింది. కార్యక్రమంలో ఎస్టీయూ పుత్తూరు మండల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నందీశ్వరునికి త్రయోదశి ప్రదోష పూజలు

నాగలాపురం, జనవరి 30 ప్రభాతవార్త: నాగలాపురం మండలంలో వెలసిన శ్రీ పల్లికొండేశ్వర ఆలయంలో సంధ్య వేళలో నందీశ్వరునికి విశేషంగా పన్నీరు చందనం పాలతో అభిషక్రం చేసి మంగళ వాయిద్యాల నడుమ ధూపదీప నైవేద్యాలతో, నవ పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్య నిర్వహణ అధికారి లత, చైర్మన్ పద్మనాభరాజు,ఆలయకమిటీ మెంబర్లు ఆలయ, భక్తులు పాల్గొన్నారు.

ఇంటి వద్దనే ఫించన్ పంపిణి చేయాలి: జిల్లా కలెక్టర్

తిరుపతి కలెక్టరేట్, జనవరి 30 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు జనవరి, 2026 31వ తేది శనివారం రోజు పంపిణీ పై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 6.30 గంటల నుంచి లబ్ధిదారుల ఇంటి వద్దనే పెన్షన్ల పంపిణీ చేయాలని సచివాలయం సిబ్బందిని ఆదేశిస్తూ డిఎల్డిఓలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షి ంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ ఆదేశించారు.శుక్రవారం పి.డి, డిఆర్డిఏ వెలుగు, లీడ్ బ్యాంకు మేనేజరు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, డిపిఓ , పంచాయితీ కార్యదర్శి తదితరులతో జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ మరియు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. కావున ఈ సమాచారం అందరికి తెలియచేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారులను, మునిసిపల్ కమిషనర్లను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఫించన్ దారులకు అందరికీ ఐ వి ఆర్ ఎస్ విధానం పై వ్యక్తిగతంగా తెలియచేయాలని అన్నారు

దేవరాజ్ స్ఫూర్తితో సేవలందిస్తాం

-ఎయిర్‌ఫోర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తిరుపతి చాప్టర్ నేతలు

తిరుపతి కలెక్టరేట్, జనవరి 30 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ కోశాధికారి, ఉమ్మడి చిత్తూరు అసోసియేషన్ అధ్యక్షుడు సార్జెంట్ ఎన్.దేవరాజ్ సేవలు శ్లాఘనీయమని ఎయిర్‌ఫోర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తిరుపతి చాప్టర్ నాయకులు స్మరించారు. శుక్రవారం స్థానిక డీఆర్ మహల్ రోడ్డులోని ఒక హోటల్‌లో దేవరాజ్ సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం దేవరాజ్ గుండెపోటుకు గురై హఠాన్మరణం చెందారు. సంస్మరణ కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఎయిర్‌ఫోర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి గిరిధర్, మాజీ ఉపాధ్యక్షులు నాగరాజునాయుడు, హానరరీ ప్లెయింగ్ ఆఫీసర్ రెడ్డెప్ప, కేంద్ర ప్రభుత్వ సిల్క్ బోర్డు మాజీ డైరెక్టర్, యూనివర్సిటీ ఆఫ్ హార్టికల్చర్ సైన్సెస్ (కర్ణాటక) విశ్రాంత ఉపకులపతి డాక్టర్ శంకర్ బి.డాన్‌డిన్, విశ్రాంత ఆర్‌పీఎఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ తిరుపతి శాఖ సెక్రటరీ ఎన్.మనోహరం తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సుధాకర్, జనార్ధన్, సార్జెంట్ బ్రహ్మానందస్వామి, ఎస్ఎంకె మూర్తి, వివిధ ప్రాంతాల సభ్యులు, కుటుంబీకులు పాల్గొన్నారు.

తిరుపతి డివిజన్

పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి విద్య,జనవరి 30 ప్రభాతవార్త: నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం చేశారు. 4వ డివిజన్ పరిధిలోని భారతీ బస్టాండ్ వద్ద మున్సిపల్ కార్పొరేషన్ బిఓటి పద్ధతిలో 22.5 లక్షలతో నిర్మించిన ప్రజా మరుగుదొడ్డిని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తిరుపతికి వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రజా మరుగుదొడ్డిని నిర్మించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నగర పరిశుభ్రత ను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరు నిర్ధించిన మరుగుదొడ్డుల్లోనే మూత్ర విసర్జన చేసి సహకరించాలని ఆయన కోరారు. కాగా 42వ డివిజన్ ప్రశాంతి నగర్‌లోని దోభి ఘాట్ ఆవరణలోని నిర్మించిన కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణానికి పూజలు నిర్వహించారు. 9.8 లక్షలతో మొదటి అంతస్తును నిర్మించనున్నారు. మరోవైపు మెటర్నిటీ హాస్పిటల్ లో అరకు కాఫీ షాప్ ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు.కుష్టు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఎం అండ్ ఎస్ ఓ బాలకృష్ణ నాయక్, డిఈ లు రమ

డిఎస్పీచే పోలీసుస్టేషన్ తనిఖీ

సూళ్లూరుపేట, జనవరి 30 ప్రభాతవార్త: డిఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో శుక్రవారం సూళ్లూరుపేట సర్కిల్ కార్యాలయాన్ని, శ్రీహరికోట పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.మురళీకృష్ణ, ఎస్ఐలు, సిబ్బందితో మాట్లాడుతూ శ్రీహరికోట భద్రతను దృష్టిలో ఉంచుకుని సిఐఎస్ఎఫ్ బలగాలతో, మెరైన్ పోలీసులతో సమన్వయంగా వ్యవహరించి పనిచేయాలని సూచించారు. గంజాయి అమ్మకాలు, వాటి అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచాలన్నారు. సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించి ప్రజలను అప్రమత్తం చేయాలని, మహిళల పట్ల ఆకతాయిల వేధింపులు, ఇతర నేరాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని డిఎస్పీ చెంచుబాబు ఆదేశించారు.

సూళ్లూరుపేటలో మహాత్మాగాంధీ వర్ధంతి

సూళ్లూరుపేట, జనవరి 30 ప్రభాతవార్త: వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో వాసవీ వనితా క్లబ్‌లకు చెందిన బండారు శబరీష్ గుప్తా, సాయిరామ్, గణేష్, బాలకృష్ణ, సౌజన్య, గౌతమి, పద్మజ, నిర్మలకుమారి, కిషోర్, కారంశెట్టి శ్రీనివాసులు, పి.చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సరస్వతిచే భక్తి ప్రవచనాలు

సూళ్లూరుపేట, జనవరి 30 ప్రభాతవార్త: శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవి దేవస్థానంలో నైనిశారణ్య శ్రీవారాహి పీఠాధిపతులు హిందూ ధార్మిక సేవాసంస్థ వ్యవస్థాపకులు శ్రీబాలబ్రహ్మానంద సరస్వతిచే జగన్మాత లీలావిలాసం అనే అంశంపై ప్రవచనాలను భక్తులకు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన హిందూ సనాతన ధర్మం, వాటిలో దేవతలకు ఉన్న విశిష్టత, వాటిని అనుసరించాల్సిన పద్ధతులు భక్తులకు వివరించారు. ఆయనను ఆలయ మర్యాదలతో సత్కరించి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బివి ప్రసన్నలక్ష్మి తీర్థప్రసాదాలు అందజేశారు.

భీష్మ ఏకాదశిన అన్నదాన కార్యక్రమం

నాయుడుపేట, జనవరి 30 ప్రభాతవార్త : స్వర్ణముఖి నది తీరాన వెలసియున్న శ్రీ ప్రసూనాంబ దేవి సమేత నీలకంఠేశ్వరస్వామి వారి ఆలయంలో భీష్మ ఏకాదశి మహోత్సవం సందర్భంగా శుక్రవారం ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సింహపురి క్యాటరింగ్ అధినేత ఎన్‌సిఆనంద్ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీనీలకంఠేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ గూడూరు సుధీర్ బాబు మాట్లాడుతూ భీష్మ ఏకాదశి సందర్భంగా సింహపురి క్యాటరింగ్ అధినేత ఎన్ సి ఆనంద్ భక్తులకు అన్నదాన కార్యక్రమం చేయడం చాలా సంతోషకరమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆనంద్ కుటుంబ సభ్యులు, ఆలయ గురు స్వామి బాలాజీ స్వామి, శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, అవధానం సుధీర్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే విజయ్‌శ్రీ

నాయుడుపేట, జనవరి 30 ప్రభాతవార్త: నియోజకవర్గ పరిధిలోని మేనకూరు సెజ్‌లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు నియోజకవర్గపరిధిలోని నిరుద్యోగులకు ప్రాధాన్యత ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కోరారు. నాయుడుపేట మండల పరిధిలోని మేనకూరు సెజ్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న కేఎంవీ ప్రాజెక్ట్ లిమిటెడ్ సిర్మా యాజమాన్య ప్రతినిధులు గాంధీజి వర్ధంతి సందర్భంగా పరిశ్రమ ప్రాంగణంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిర్మా పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ పీవీ నరసింహులు, పరిశ్రమ జీఎం మురళీకృష్ణ, ప్రాజెక్ట్ మేనేజర్ శివకుమార్, సీనియర్ మేనేజర్ మోహన్, మేమున్నాం ఫౌండేషన్ ఫౌండర్ కె గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయ్‌శ్రీ

నాయుడుపేట, జనవరి 30 ప్రభాతవార్త : ప్రజా సమస్యలు తెలుసుకొని సత్వరం పరిష్కరించేందుకే ప్రజా దర్బార్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని సూళ్లూరుపేట నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. పెళ్లకూరు మండలం పాలల్లూరు గ్రామ పంచాయతీ జంగాలపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యంతో కలసి ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని అన్నీ మండల గ్రామ పంచాయతీలాల్లో ప్రజా దర్బార్ కార్యక్రమాలు నిర్వహిస్తూ సమస్యలతో పాటు పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమంలుకు శ్రీకారం చూడుతూ నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పలు సమస్యలపట్ల ప్రజలు ఇచ్చిన అర్జీలను స్వీకరించారు. వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ ప్రజలు, అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామాగ్రి అందజేశారు

తడ,జనవరి 30 ప్రభాతవార్త: ఆచార్య భరద్వాజ సేవా సంస్థ సూళ్లూరుపేట వారి ఆధ్వర్యంలో కబడ్డీ క్రీడాకారులకు క్రీడా సామాగ్రి అందజేశారు. తడ మండలం వాటంబేడు జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు అశ్విని, లావణ్య, శ్రీనిధి, కబడ్డీ ఆటలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ రాష్ట్ర స్థాయి నుండి జాతీయ స్థాయిలో కబడ్డీ క్రీడలో పాల్గొనేందుకు సిద్ధమవుతున్న తరుణంలో వారిని ప్రోత్సహిస్తూ కబడ్డీ క్రీడా సామాగ్రిని ఆచార్య భరద్వాజ సేవాసమితి సంస్థ ప్రతినిధులు అందజేశారు అదేవిధంగా పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బందికి దుస్తులు అందజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదలకు ప్రభుత్వ భూములు పంచాలి : సిపిఎం

వెంకటగిరి, జనవరి 30 ప్రభాతవార్త: మండలంలోని పెట్లూరు, కలపాడు గ్రామ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూములకు పట్టాలు ఇవ్వాలని సిపిఎం నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి చంగయ్య తెలిపారు. వెంకటగిరిలోనే ప్రైవేట్ కళ్యాణ మండపం వద్ద జిల్లా అధికారులు నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం వద్ద సిపిఎం నాయకులు ధర్నా చేశారు. ఎన్నో సంవత్సరం నుంచి సాగు చేసుకుంటున్న భూములకు కూడా పట్టాలు ఇవ్వడం లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామాల్లోని రైతులు పాల్గొన్నారు.

సూళ్ళూరుపేట డివిజన్

రౌడీ మూకలతో దాడి!

- 20 మందితో హత్యాయత్నం ప్రయత్నం- ఒకరి పరిస్థితి విషమం, మరి కొందరికి గాయాలు

దొరవారిసత్రం, జనవరి 30 ప్రభాతవార్త: దొరవారిసత్రం మండలం వడ్డీకండ్రిగ గ్రామానికి చెందిన ఓ మహిళపై నాలుగు రోజులు క్రితం అదే గ్రామానికి చెందిన వై.అశోక్ హత్యాయత్నానికి పాల్పడినట్లు కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. ఇరువర్గాల వారు గురువారం రాత్రి దొరవారిసత్రం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. నాయుడుపేట రూరల్ సిఐ సంగమేశ్వర రావు ఎప్పటికప్పుడు అక్కడ ఎలాంటి అవాంఛనే సంఘటన చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టారు అదేవిధంగా పరార్‌లో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.

ఓట్ల కోసం వాగ్దానాలు చేసే ఎమ్మెల్యేని కాను

పెళ్లకూరు, జనవరి 30 ప్రభాతవార్త: ప్రజాసేవే పరమావధిగా భావించి రాజకీయాల్లోకి వచ్చానని ఓట్ల కోసం కల్లబొల్లి వాగ్దానాలు చెప్పి రాజకీయాలు చేయడం నాకు చేతకాదు అని నేనంటే గిట్టని కొంతమంది నాయకులు నామీద అసత్య ప్రచారాలు చేస్తున్నారని మా నాయకుడు చంద్రబాబు నాయుడు ఆశీర్వాదంతో ఎన్నికల ప్రచారంలో చెప్పిన ప్రతి ఒక్క వాగ్దానాన్ని కచ్చితంగా నెరవేరుస్తానని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. గత ప్రభుత్వం అభివృద్ధిని మరిచి కక్షపూరిత రాజకీయాలు చేయడం ద్వారానే ప్రజలు ఇన్ని ఇబ్బందులు పడుతున్నారని వీటన్నింటినీ అధిగమిస్తూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి వైపు పరుగులు తీస్తుందని శుక్రవారం నాడు మండలంలోని జంగాలపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రసంగించారు. అనునిత్యం ప్రజల్లో ఉంటూ గుడ్ మార్నింగ్ సుళ్ళూరుపేట, గుడ్ మార్నింగ్ నాయుడుపేట వంటి కార్యక్రమాల ద్వారా వారి సమస్యలను తెలుసుకుంటూ నిరంతరం ప్రజల్లోనే ఉంటూ ప్రజాసేవ చేయడం నాకు ఇష్టం అన్నారు. అదేవిధంగా ఈ ప్రజా దర్బార్‌లో వచ్చిన అర్జీలను అతి తొందరలోనే పరిశీలించి ప్రజలకు న్యాయం చేస్తానన్నారు.

పేదల భూములు ఆక్రమణపై ఎమ్మెల్యేకు వినతి

పెళ్లకూరు, జనవరి 30 ప్రభాతవార్త: ముమ్మా రెడ్డి గుంట పంచాయతీకి చెందిన దళితులు ఎన్నో సంవత్సరాలుగా మా పూర్వీకుల కాలం నుంచి తాము సాగు చేసుకుంటున్న భూములను ఇప్పుడు కొంత మంది భూస్వాములు ఆక్రమించుకుని మాపై దౌర్జన్యం చేస్తున్నారని ఎమ్మెల్యే ఈ విషయంలో కల్పించుకుని మా భూములు పై మాకు పట్టాలనిపించి న్యాయం చేయాలని శుక్రవారం జంగాలపల్లి గ్రామంలో జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో వినతి పత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే విజయ శ్రీ అధికారులతో సంప్రదించి ఆ భూములపై సర్వే చేయించి తప్పకుండా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

కూటమి ఇసుక దందాపై గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఆశ్రయిస్తాం

- వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుపల్లి

వెంకటగిరి, జనవరి 30 ప్రభాతవార్త: కూటమి నేతల ఇసుక దందాపై గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయిస్తానని వైసిపి సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో కూటమి నాయకుల ఇసుక దందా ఎక్కువైందని తెలిపారు. కలువాయి మండలం తెలుగు రాయపురం వద్ద నదిని కొల్లగొడుతున్న మాఫియాపై ఆయన మండిపడ్డారు. నియోజకవర్గంలో ఇసుక దందా రాజ్యమేలుతోందని దినపత్రికలో వచ్చిన వార్త కథనమే నిదర్శనమని తెలిపారు. పర్యావరణ విధ్వంసానికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజాధనాన్ని దోచుకుంటూ, నదులను నాశనం చేస్తున్న కూటమి ఇసుక మాఫియా స్థానిక ఎమ్మెల్యే ఎందుకు స్పందించరని ప్రశ్నించారు. వైసిపి నాయకులు అందరం ఇసుక దోపిడీ వద్దకు వెళితే యంత్రాలన్నిటినీ తరలించి కొన్ని చెట్లలో దాచి పెట్టారని తెలిపారు. పర్యావరణాన్ని కూటమి నాయకులు నాశనం చేస్తున్నట్లు చెప్పారు. ప్రతిరోజు తెలుగు రాయపురం వద్ద నిఘా ఉంటామని తెలిపారు. కూటమి నాయకుల దందాను సహించమని చెప్పారు. ఆయన వెంట జడ్పిటిసి అనిల్ కుమార్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య, జిల్లా టెలికం సలహా మండలి సభ్యులు హరికృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు ప్రసాద్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి తదితరులు ఉన్నారు.

సిట్ నివేదికే ఆధారం

- నిందితులెవరూ తప్పించుకోలేరు - ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, జనవరి 30 ప్రభాతవార్త: తిరుమల లోని దేవదేవుని లడ్డూ ప్రసాదాలను కల్తీ నెయ్యితో అపవిత్రం చేసిన నిందితులను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టదని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ గారు స్పష్టం చేశారు. శుక్రవారం వెంకటగిరి పట్టణములో మీడియాతో మాట్లాడారు. స్వామివారి ప్రసాదంలో కల్తీ చేసి కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. తిరుమల లడ్డూ ప్రసాదం కేవలం ఆహార పదార్థం కాదని, కోట్లాది భక్తుల విశ్వాసానికి ప్రతీక అని గుర్తుచేశారు.అలాంటి పవిత్రమైన ప్రసాదాన్ని కల్తీ చేసి ప్రజల మనోభావాలను దెబ్బతీసిన వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. దేవుడి ప్రసాదంపై జరిగిన ఈ అపచారానికి బాధ్యులైన వారిని శిక్షించే వరకు ప్రభుత్వం వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. భక్తుల విశ్వాసమే ప్రభుత్వానికి బలం. ఆ విశ్వాసాన్ని దెబ్బతీసిన వారిపై చట్టం తన పని తాను చేస్తుంది అని తేల్చిచెప్పారు.

గొల్లపాలెంలో పశు వైద్య ఆరోగ్య శిబిరాలు

వాకాడు, జనవరి 30 ప్రభాతవార్త: మండల కేంద్రమైన వాకాడు పంచాయతీ పరిధిలోని గొల్లపాలెం గ్రామంలోని శుక్రవారం పశు వైద్య ఆరోగ్య శిబిరాలు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమనకు తిరుపతి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి పశు వైద్య ఆరోగ్య శిబిరాల ద్వారా పాడి రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు, ముఖ్యంగా పశువులు గర్భం దాల్చిన వాటికి ఎప్పటికప్పుడు పశు వైద్య సిబ్బంది పాడి రైతులకు అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఏడి మంజుల, జె.వి.ఓ విజయ, పశు వైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

వాకాడు, జనవరి 30 ప్రభాతవార్త: మండల కేంద్రమైన వాకాడు పంచాయతీలోని ఎన్ జే ఆర్ గిరిజన కాలనీలో శుక్రవారం కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం జరిగింది. బొపాలిరెడ్డి పాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలు వేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ జయ సూర్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలో కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఏఎఫ్ కే విజయభారతి, కొండమ్మ, ఎం ఎల్ హెచ్ పి శాలిని, ముత్యాలయ్య, ఆశా వర్కర్లు మణెమ్మ, నాగేశ్వరమ్మ, సుబ్బమ్మ, పార్వతి, అంగన్వాడి కార్యకర్త చెంచమ్మ స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నిడిగుర్తిలో సివిల్ రైట్స్ డే

వాకాడు, జనవరి 30 ప్రభాతవార్త: వాకాడు మండలం నిడిగుర్తి పంచాయతీ పరిధిలోని గిరిజన కాలనీలో శుక్రవారం సివిల్ రైట్స్ డే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సయిద్ ఇక్బాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు మీ ఇంటి వద్దకే వచ్చామని తెలిపారు, మండల పరిషత్ ఏవో శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లాపు నాగరాజు, వీఆర్వో శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబుకు ఘనస్వాగతం

గుడుపల్లె, జనవరి 30 ప్రభాతవార్త : మూడు రోజుల కుప్పం పర్యటన నిమిత్తం విచ్చేసిన సిఎం చంద్రబాబు నాయుడుకు ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం ఘనస్వాగతం పలికారు. శుక్రవారం సాయంత్రం 4.10గంటలకు హెలికాప్టర్‌లో సిఎం చంద్రబాబు మండలంలోని అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ప్రాంగణంకు చేరుకున్నారు. అక్కడ ప్రభుత్వవిప్ కంచర్ల శ్రీకాంత్, చిత్తూరు ఎంపి దగ్గుమల్ల ప్రసాదరావు, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్ సురేష్‌బాబు, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్, అమరనాథ్‌రెడ్డి, గాలిభానుప్రకాష్, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ, ఆర్డీఓ శ్రీనివాసులురాజు, టిటిడి డైరెక్టర్ వైద్యం శాంతారాం,టిడిపి జిల్లా అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి, చుడా ఛైర్మన్ కటారి హేమలత, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మనోహర్, గౌనివారి శ్రీనివాసులు, ద్రవిడ వర్సిటీ విసి ఆచార్య ఎం.దొరస్వామి, స్థానిక నేతలు ఘనస్వాగతం పలికారు.

తిరుమల లడ్డూ ఘటనపై టిడిపి ర్యాలీ

పలమనేరు, జనవరి 30, ప్రభాతవార్త: తిరుమల లడ్డూ ప్రసాదం ఘటనపై పలమనేరులో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం ఎంబిటి రోడ్డులో పోలీస్ స్టేషన్ ఎదురుగా తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా వున్న సమయంలో తిరుమల లడ్డూను అపవిత్రం చేశారని మహాప్రసాదానికి మహాపచారం చేశారని ఆరోపించారు. ఆవు నెయ్యికి బదులు పందికొవ్వు, గొడ్డు కొవ్వు కలిపి కల్తీ చేశారని, ప్రపంచ వ్యాప్తంగా తిరుమల వెంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలు దెబ్బతీసిన ఘనత వైఎస్ జగన్‌దేనని విమర్శించారు. ఈ కుంభకోణంలో కోట్లాది రూపాయలు చేతులు మారాయని దీనిపై విచారణకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సిట్ ఏర్పాటు చేశారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంత్రి వర్గం దీన్ని సమర్థించారని, వైసిపి నాయకులు కోర్టులకు కూడా వెళ్ళారని, వెంటనే వైఎస్ జగన్ ఆ పార్టీ నాయకులు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు ఆర్‌వి. బాలాజీ, ఆర్‌బిసి కుట్టి, ఖాజా, గిరి, నాగరాజు, మురళీ క్రిష్ణ, ఎకె కిరణ్, బిఆర్‌సి కుమార్‌లు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.2.03కోట్లు

శ్రీకాళహస్తి,జనవరి 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని స్వామి అమ్మవార్ల పరివార దేవతల ఆలయాల వద్ద భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించారు. 37 రోజులకు భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.2కోట్లు 3లక్షల 77 లక్షల 227లు వచ్చినట్లు ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి వివరించారు. ఇందులో కరెన్సి రూ.1,95,81,101లు చిల్లర నాణెములు 7,96,126లు వచ్చిందన్నారు. అలాగే కరెన్సి నోట్లు 181 వచ్చాయని ఇందులో ఎక్కువగా అమెరికాకు సంబంధించి డాలర్లు ఉన్నాయని వివరించారు. బంగారు నగల రూపంలో 94 గ్రాములు వచ్చాయన్నారు. వెండి నాగపడగల రూపంలో 677కిలోల 400 గ్రాములు వచ్చినట్లు వివరించారు.ఆలయంలో సంస్కరణలు అమలు చేస్తున్నందువల్ల అక్రమార్కులకు చెక్ పడిందన్నారు.దాంతో హుండాల్లో ఆదాయాలు పెరుగుతున్నాయని ఇఓ బాపిరెడ్డి వివరించారు. లెక్కింపుల్లో చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్, సభ్యులు, డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి,ఇఇ శ్రీనివాసులురెడ్డి వారి సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్పేడు బైపాస్‌ను పరిశీలించిన కలెక్టర్

-వార్తకు స్పందన

ఏర్పేడు,జనవరి 30 ప్రభాతవార్త: ఏర్పేడులో నత్తనడకన నడుస్తున్న బైపాస్ రోడ్డు పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరన్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ పని చేస్తున్న కాంట్రాక్టర్లకు సంబంధించిన ప్రతినిధులతో కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం వార్త దినపత్రికలో' రైల్వేశాఖ జాప్యం-ప్రయాణీకులకు శాపం' అనే వార్త ప్రచురితమైంది. దాంతో స్పందించిన కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ రోడ్డుపనులను పరిశీలించారు. ఇక్కడ రైల్వే లైన్ దాటాల్సి ఉంది. ఇందుకు సంబంధించి దిమ్మెలు కూడా సిద్ధం చేసి ఉండటాన్ని గుర్తించారు. ఎన్ హెచ్ 565లోని ఎల్‌సి నంబర్ 36 ఆర్‌ఓబి స్థలాన్ని పరిశీలించారు.పనుల్లో పురోగతి ఉండాలన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తి అయ్యింది. కానీ రైల్వే భాగానికి సంబంధించిన పనులతో పాటు ఒక వైపు ట్రాఫిక్ పనులను ప్రారంభించాలని ఎన్ హెచ్ అధికారులకు ఆదేశించారు.కలెక్టర్‌తో పాటు తహశీల్దార్ భార్గవి, ఎంపిడిఓ సౌభాగ్యం తదితర అధికారులు ఉన్నారు.

ముత్యాలమ్మగుడి చైర్మెన్‌గా రేణుకమ్మ

శ్రీకాళహస్తి,జనవరి 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ఆలయాలకు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి జీర్ణోద్ధారణ కమిటలను నియమించారు. గతంలో బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హాయంలో అనుబంధ ఆలయాలకు జీర్ణోద్ధారణ కమిటిలను నియమించి కార్యకర్తలను సంతృప్తి పరచారు. 12 ఆలయాలకు ధర్మకర్తల మండళ్ళ పేరుతో ఒక్కొక్క ఆలయానికి చైర్మెన్‌తో పాటు 15 మంది సభ్యులను నియమించారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ముత్యాలమ్మగుడి చైర్మెన్ పగ్గాలను గతంలో పర్యవేక్షించిన మాజీ కౌన్సిలర్ బి.రేణుకమ్మను చైర్మెన్‌గా నియమించారు.

గాంధీ ఆశయాలు నెరవేరుద్దాం

-ఎస్వీడిసిఎల్‌లో నివాళులు

తిరుపతి, జనవరి 30 ప్రభాతవార్త: ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో శుక్రవారం మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి ఆదేశాలతో సంస్థ కార్పొరేట్ కార్యాలయం (విద్యుత్ నిలయం)లో మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ (టెక్నికల్, హెచ్ఆర్డి) కే. గురవయ్య, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్, ఐటి) పి. అయూబ్ ఖాన్ సమాజంలో యువత గాంధేయ మార్గాన్ని అనుసరిస్తూ సమాజాభివృద్ధికి తమవంతు సహకారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిజిఎంలు కె. ఆదిశేషయ్య, ఎం. మురళి కుమార్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె.జనార్దన్ నాయుడు, సంయుక్తకార్యదర్శిఎం. గోపాల కృష్ణ, జిఎంలు సిహెచ్ రామచంద్రరావు, వి. విజయన్, వై.వెంకటరాజు, సి. ప్రసాద్, డి. సురేంద్ర రావు, శ్రీనివాసులు, ఎస్ఈ సివిల్ డి. తిరుమలరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ అదుపుతప్పి కూలీ మృతి

తిరుపతి,జనవరి 30ప్రభాతవార్త: నగరంలో ట్రాక్టర్ అదుపుతప్పి పైనుండి కూలీజారి పడి ప్రాణాలు కోల్పోయాడు.ఈ సంఘటన శుక్రవారం సాయంత్రం తిరుపతిలోని డిబిఆర్ ఆస్పత్రి రోడ్డులో జరిగింది. ఓ ట్రాక్టర్ శుక్రవారం సాయంత్రం ఆ మార